సాగునీటి ప్రక్షాళనకు శ్రీకారం

● నేడు ప్రాజెక్టు కమిటీ తొలి సమావేశం ● సత్తెనపల్లి జలవనరులశాఖ అతిథి గృహంలో నిర్వహణ ● కీలక నిర్ణయాలు తీసుకుంటేనే మేలంటున్న రైతులు



8

గోవిందాపురం మైనర్‌లో పెరిగిన రబ్బరు మొక్కలు

గుంతల రహదారికి మోక్షం



గోతుల మయంగా ఉన్న కొండమోడు రహదారి

(నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

ప్రధాని నరేంద్రమోదీ స్వయంగా పనులను ప్రారంభించడంతో కొండమోడు - పేరేచర్ల జాతీయ రహదారికి మహర్దశ పట్టనుంది. రహదారి పనులకు నిధులు మంజూరు.. భూసేకరణ.. టెండర్ ప్రక్రియ పూర్తయింది. పనులు ప్రారంభించేందుకు జాతీయ రహదారుల అథార్టీ చర్యలు చేపట్టింది. దశాబ్దాలుగా కొండమోడు రహదారిని విస్తరించాలని వాహనదారులు కోరుతున్నారు. సత్తెనపల్లి - కొండమోడు మధ్య రహదారిపై పెద్దఎత్తున గోతులు ఉన్నాయి. దీంతో ఈ రహదారిపై ప్రయాణం ప్రాణ సంకటంగా మారింది. ఈ రహదారిలో ప్రయాణించేందుకు వాహనదారులు సాహసించడంలేదు. గుంటూరు నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు నరసరావుపేట నుంచి వెళ్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. మొత్తం మీద ప్రధాని నరేంద్రమోదీ స్వయంగా పనులకు శంకుస్థాపన చేయడంతో రహదారిని వేగవంతంగా విస్తరించేందుకు సాకారం ఏర్పడింది. పేరేచర్ల నుంచి కొండమోడు మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరించనున్నారు. ఒక్కొక్క వైపు 8.75 మీటర్లు రహదారి నిర్మిస్తారు. 1.5 మీటర్లు డివైడర్.. రెండు వైపులా మార్జిన్లతో కలిపి మొత్తం 22.5 మీటర్ల వెడల్పుతో రహదారిని విస్తరిస్తారు. సుమారు 585 ఎకరాల భూమిని రహదారి విస్తరణ కోసం సేకరించారు. కేంద్ర ప్రభుత్వం రూ.882 కోట్లు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియను కూడా పూర్తి చేశారు. మేడికొండూరులో సుమారు ఐదు కిలోమీటర్లు, సత్తెనపల్లి పట్టణానికి 11 కిలోమీటర్లు మేర బైపాస్ నిర్మించనున్నారు. కాంట్రాక్టర్‌ను ఖరారు చేయడంతో త్వరలోనే పనులు ప్రారంభంకానున్నాయి.

తీరంలో.. అనుసంధానం



ఎన్‌హెచ్ 216 జాతీయ రహదారి

(బాపట్ల - ఆంధ్రజ్యోతి)

జిల్లా పరిధిలోని 72 కిలోమీటర్ల మేర తీర ప్రాంతాన్ని కలుపుతూ జాతీయ రహదారి 216 విస్తరణ పనులను 2017లో కేంద్రం ప్రారంభించింది. రూ.786 కోట్ల వ్యయంతో 62.13 కిలోమీటర్ల మేర నిర్మాణం చేపట్టిన ఎన్‌హెచ్ 216 పనులు 2023లో పూర్తి కాగా 2024 నుంచి ప్రజలకు ఉపయోగంలోకి వచ్చింది. ఈ రహదారిని ప్రధాని విశాఖ వేదికగా జాతికి అంకితం చేశారు. రేపల్లె నుంచి ప్రారంభమయ్యే 216 రెండు వరుసల రహదారి భట్టిప్రోలు, చెరుకుపల్లి, కర్లపాలెం, బాపట్లతో పాటు చీరాల మండల పరిధిలోని ఈపూరుపాలెంలను అనుసంధానం చేస్తోంది. ప్రాజెక్టు ప్రారంభించినప్పుడు అంచనా వ్యయం రూ.487 కోట్లుకాగా, నిర్మాణం పూర్తయ్యేనాటికి అది రూ.786 కోట్లకు చేరుకుంది. ఈ రహదారి వల్ల బాపట్లలో ట్రాఫిక్ సమస్యలకు చెక్ పడుతుంది.

వైసీపీ ప్రభుత్వంలో నత్తనడకన..

2017లో ప్రారంభమైన 216 జాతీయ రహదారి పనులు రెండేళ్ల పాటు శరవేగంగా కొనసాగాయి. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వం రావడంతో పనుల్లో వేగం లోపించింది. నిర్మాణ పనుల్లో జాప్యంతో తొలి అంచనాలకు మించి ఖర్చు అయింది. దీనికి తోడు భూసేకరణలో కూడా వైసీపీ ప్రభుత్వం అడ్డగోలుగా వ్యవహరించడం కూడా నిర్మాణ వ్యయం పెరగడానికి కారణమైంది. ప్రారంభించిన మూడేళ్ల వ్యవధిలోనే నిర్మాణం పూర్తి చేయాలని తొలుత లక్ష్యం నిర్దేశించుకున్నప్పటికీ ఎట్టకేలకు గతేడాది అది వాడుకలోకి వచ్చింది.

సాగర్ నుంచి మల్లాయపాలెం వరకు..

(నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

నాగార్జున సాగర్ - దావులపల్లి జాతీయ రహదారిని 47 కిలోమీటర్ల మేర రెండు వరుసలుగా విస్తరించారు. రూ.230 కోట్లతో పనులు పూర్తి చేయగా రహదారిని ప్రధాని ప్రారంభించారు. దావులపల్లి నుంచి ప్రకాశం జిల్లా మల్లాయపాలెం జాతీయ రహదారిని రెండు వరుసలుగా విస్తరించనున్నారు. రూ.312 కోట్లతో 20 కిలోమీటర్ల మేర రహదారిని విస్తరిస్తారు. ఈ పనులకు కూడా ప్రధాని శంకుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. రహదారి నిర్మాణానిక సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తి చేశారు. భూసేకరణ పనులు పూర్తయ్యాయి. రహదారి విస్తరణ పనులు వెనువెంటనే ప్రారంభించేందుకు నేషనల్ హైవే అథార్టీ చర్యలు చేపట్టింది.



ప్రధాని ప్రారంభించిన నాగార్జున సాగర్ - దావులపల్లి రహదారి



జిల్లాకు సంబంధించిన వివిధ ప్రాజెక్టులను విశాఖపట్నం నుంచి వర్చువల్‌గా ప్రారంభిస్తున్న ప్రధానమంత్రి మోదీ, వేదికపై గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, కేంద్రమంత్రి రామోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత తదితరులు

పలు ప్రాజెక్టులకు ప్రధాని ప్రారంభం.. శంకుస్థాపన

కొండమోడు రహదారి, నల్లపాడు-బీబీనగర్ డబ్లింగ్‌కు మహర్దశ

చిలకలూరిపేట బైపాస్, దావులపల్లి, ఎన్‌హెచ్-216 రహదారులు జాతికి అంకితం

విశాఖపట్టణం నుంచి వర్చువల్‌గా శిలాఫలకాలను ఆవిష్కరించిన మోదీ

జాతికి అంకితం.. జిల్లా అభివృద్ధికి.. ఆవిష్కారం

రహదారులు జాతికి అంకితంతో పాటు వివిధ పనులకు సంబంధించిన శిలాఫలకాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ విశాఖపట్నం నుంచి బుధవారం ఆవిష్కరించారు. కొండమోడు రహదారి.. నల్లపాడు-బీబీనగర్ డబ్లింగ్.. పనులకు శంకుస్థాపన చేయగా చిలకలూరిపేట బైపాస్, దావులపల్లి, ఎన్‌హెచ్-216 రహదారులు జాతికి అంకితం చేశారు. ఒకే రోజు ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలోని వివిధ పనుల ప్రారంభోత్సవాలతో పాటు రహదారులను జాతికి అంకితం చేశారు. ఆయా పనులకు సంబంధించిన శిలాఫలకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో కలిసి మోదీ ఆవిష్కరించారు. ప్రధాని స్వయంగా ప్రారంభించడంతో కొండమోడు రహదారితో పాటు నల్లపాడు-బీబీనగర్ డబ్లింగ్ పనులు శరవేగంగా పూర్తి అవుతాయని ప్రజలు ఆశిస్తున్నారు. కాగా బుధవారం మోదీ పనులకు శంకుస్థాపన దృశ్యాలను గుంటూరు, నడికుడి తదితర రైల్వేస్టేషన్లలో తెరలు ఏర్పాటు చేసి ప్రయాణికులు వీక్షించే సౌకర్యాన్ని కల్పించారు. ఈ ప్రాజెక్టు పూర్తి అయితే సరుకు రవాణాతో పాటు రైళ్ల వేగం కూడా పెరిగే అవకాశం ఉంది. దేశంలోనే మొదటి మోడల్ ప్రాజెక్టుగా చేపట్టిన చిలకలూరిపేట బైపాస్ రోడ్డును ప్రధాని జాతికి అంకింతం చేశారు. నాగార్జున సాగర్ - దావులపల్లి జాతీయ రహదారిని నరేంద్ర మోదీ ప్రారంభించారు. దావులపల్లి నుంచి ప్రకాశం జిల్లా మల్లాయపాలెం జాతీయ రహదారిని రెండు వరుసలుగా విస్తరించే పనులకు మోదీ ప్రారంభోత్సవం చేశారు. రేపల్లె నుంచి ఈపూరుపాలెం 216 రహదారితో రేపల్లె, బాపట్ల, చీరాల నియోజకవర్గాలకు అనుసంధానం ఏర్పడింది. బాపట్ల జిల్లా పరిధిలోని 62.13 కిలోమీటర్ల మేర 216 జాతీయ రహదారిని ప్రధాని జాతికి అంకితం ఇవ్వడం పట్ల ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.

పట్టాలెక్కిన డబ్లింగ్ ప్రాజెక్టు

(గుంటూరు - ఆంధ్రజ్యోతి)

గుంటూరు రైల్వే డివిజన్ దశ దిశ మార్చబోయే కీలకమైన నల్లపాడు - బీబీనగర్ డబ్లింగ్ ప్రాజెక్టు పట్టాలెక్కింది. ఈ ఏడాది కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించి పింక్‌బుక్‌లో చేర్చిన రైల్వే శాఖ బుధవారం ప్రధానమంత్రి



శంకుస్థాపన చేయించింది. రూ.2853.23 కోట్ల అంచనా విలువకాగల ఈ ప్రాజెక్టు నిర్మాణ సమయంలో వేల మందికి ఉపాధి లభించనుంది. అలానే ప్రాజెక్టు పూర్తి అయితే తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ మధ్య రైలు కనెక్టివిటీ గణనీయంగా పెరుగుతుంది. వాణిజ్యపరంగానూ రెండు రాష్ట్రాలలోని గ్రామీణ ప్రాంతాలకు మేలు కలుగుతుంది. నల్లపాడు - బీబీనగర్ మధ్యన ప్రస్తుతం సింగిల్ లేన్ రైలు మార్గం అందుబాటులో ఉన్నది. దీని వల్ల లైన్ కెపాసిటీ 215కి చేరింది. దీంతో కొత్తగా రైళ్లను ప్రవేశపెట్టలేని పరిస్థితి నెలకొన్నది. గత ఏడాది ప్రకృతి విపత్తుల సమయంలో కాజీపేట మార్గానికి ప్రత్యామ్నాయంగా నల్లపాడు - బీబీనగర్ రైల్వేలైన్‌ని వినియోగించడంతో రైళ్లు గంటల తరబడి ఆలస్యంగా నడిచాయి. కాగా ఈ మార్గాన్ని డబ్లింగ్ చేయాలని దశాబ్దాల తరబడి ఎంపీలు కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ వస్తున్నారు. ఎట్టకేలకు ఎన్‌డీఏ-3 ప్రభుత్వంలో ఈ ప్రాజెక్టు మంజూరైంది. 238.99 కిలోమీటర్ల పొడవునా ఈ డబ్లింగ్ ప్రాజెక్టుని చేపడతారు. ఇందులో కృష్ణానదిపై మేజర్ బ్రిడ్జిని కూడా నిర్మించాల్సి ఉన్నది. అలానే వలిగొండ, నాగార్జునసాగర్ లెఫ్ట్ మెయిన్ కెనాల్, మూసినదిపై వంతెనల నిర్మాణాలు చేయాలి. పగిడిపల్లి నుంచి కుక్కడం వరకు భూమి అందుబాటులో ఉండటంతో మూడు సెక్షన్లుగా విడగొట్టి పనులు చేపట్టేందుకు టెండర్లను కూడా రైల్వే శాఖ నిర్వహించింది. కుక్కడం - నడికుడి, కుక్కడం - వలిగొండ, పగిడ్లి - బొమ్మాయిపల్లి మధ్య ఇప్పటికే భూమి చదును పనులు మొదలయ్యాయి. మరోవైపున నడికుడి - నల్లపాడు మధ్య గుంటూరు, పల్నాడు జిల్లాల్లో భూసేకరణ చేయాల్సి ఉండగా రెండు జిల్లాల ఆర్‌డీవోలు ఇప్పటికే నోటిఫికేషన్లు జారీ చేశారు. రైతుల వద్ద తీసుకోబోయే భూమికి అవార్డులు జారీ చేస్తే పనులు ప్రారంభించడానికి అవరోధాలు తొలగిపోతాయి. కనీసం 80 శాతం భూమి అందుబాటులోకి వస్తే పనులు ప్రారంభిస్తామని రైల్వేవర్గాలు తెలిపాయి.



బైపాస్‌తో కష్టాలకు చెక్

(నరసరావుపేట - ఆంధ్రజ్యోతి)

చిలకలూరిపేట బైపాస్ రహదారిని ప్రధాని నరేంద్రమోదీ జాతికి అంకితం చేశారు. రూ.907 కోట్లతో బైపాస్ నిర్మించారు. 16వ నెంబరు జాతీయ రహదారి బొప్పూడి సమీపం నుంచి తిమ్మాపురం వరకు బైపాస్ 16.384 కిలోమీటర్ల మేర నిర్మించారు. దేశంలోనే మోడల్ బైపాస్ ఇది. రహదారికి ఇరువైపులా శాశ్విత గోడ నిర్మించారు. బైపాస్ విశాలమైన ప్రాంతాల్లో ఒక మోగా వాట్ సోలార్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను రాత్రి వేళ రహదారిపై ఏర్పాటు చేసిన లైటింగ్‌కు వినియోగిస్తారు. దాదాపు 3,500 మొక్కలు నాటారు. బైపాస్‌తో చికలూరిపేట పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు తీరాయి.

అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ సతీశ్‌కుమార్



8

రేపు నృసింహుని.. ఉత్తర ద్వార దర్శనం

● బంగారు దక్షిణావృత శంఖుతో భక్తులకు తీర్థం

● ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ సతీశ్‌కుమార్

అమరావతి పనులకు ఆమోదం

● మరో రూ.11,467 కోట్ల పనులకు పరిపాలనా అనుమతులు ● ఇప్పటికే రూ.20 వేల కోట్ల పనులకు ఆమోదం

6

ఆర్‌వోబీకి.. రూ.107.79 కోట్లు

గడ్డిపాడు వద్ద బ్రిడ్జికి కేంద్రం అంగీకారం

రైల్వే జీఎంకు కేంద్రం నుంచి అధికారికంగా లేఖ

ఫలించిన కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని కృషి

గుంటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరం ఇన్నర్ రింగ్‌రోడ్డులోని గడ్డిపాడు రైల్వే గేటు వద్ద ఎన్నో ఏళ్లుగా వాహన చోదకులకు ఎదురవుతున్న కష్టాలు



ఇన్నర్‌రింగ్ రోడ్డులోని గడ్డిపాడు వద్దనున్న రైల్వే గేటు

తీరనున్నాయి. ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చినట్లుగా కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ గడ్డిపాడు వద్ద ట్రాక్‌పై ఆర్‌వోబీ నిర్మాణాన్ని సాధించుకున్నారు. ఆర్‌వోబీ నిర్మాణానికి అనుమతిస్తూ రూ.107.79 కోట్లను మంజూరు చేస్తున్నట్లుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. జీఏడీ అనుమతులు, డీపీఆర్ వర్క్స్, డ్రెయినేజీ ఆధునికీకరణ, డిజైన్లు, భూసేకరణ, తదితర ప్రక్రియలను సిద్ధం చేయాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్‌కు కేంద్ర ప్రభుత్వం అధికారికంగా బుధవారం లేఖ రాసింది. ప్రధాన రహదారిగా మారిన ఇన్నర్‌రింగ్‌రోడ్డులో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంది. అయితే గడ్డిపాడు వద్ద రైల్వే గేట్ ఉండటంతో రైళ్ళ రాకపోకల సమయాల్లో ఆ గేటు తరచూ మూయాల్సి వస్తుంది. ఈ సమస్య ఎంతో కాలంగా ప్రయాణికులకు అసౌకర్యంగా మారింది. ఎన్నికల సమయంలో అప్పటి టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పెమ్మసాని ప్రచారం సందర్భంగా ఈ సమస్య గురించి ఆయన దృష్టికి ప్రజలు తీసుకువచ్చారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఈ సమస్య పరిష్కారానికి కృషి చేసి సాధించారు. పనులు ప్రారంభమై బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే వాహనదారులకు ఎంతో సౌకర్యంగా ఉండి సమయం ఆదా అవుతుంది. నాలుగు లైన్ల ఆర్‌వోబీ నిర్మాణం నిమిత్తం గుంటూరు నంబూరు రైల్వేస్టేషన్ల మధ్యలో ఉన్న ఎలేన్ నెంబరు 8 పనులకు కేంద్ర ప్రభుత్వం గతి శక్తి పథకం కింద అనుమతులను బుధవారం మంజూరు చేసింది. పెమ్మసాని చొరవతో మంజూరైన గడ్డిపాడు ఆర్‌వోబీ గుంటూరు సిగకు మరో మణిహారం చేరబోతుందని చెప్పవచ్చు. నందివెలుగు-గుంటూరు మధ్య అసంపూర్తిగా నిలిచిపోయిన వంతెన పనులతో పాటు శ్యామలానగర్, నిడమర్రు, పెదకాకాని, పలకలూరు, నెహ్రూనగర్ ఆర్‌యూబీలకు కేంద్రమంత్రి పెమ్మసాని ప్రణాళికలను సిద్ధం చేయించారు.

ఇప్పటికే శంకర్‌విలాస్ ఆర్‌వోబీ విస్తరణకు చర్యలు..

పెమ్మసాని బాధ్యతలు చేపట్టిన వెంటనే తొలి ప్రయత్నంగా శంకర్ విలాస్ బ్రిడ్జి విస్తరణ పనులకు నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేశారు. పెమ్మసాని ప్రయత్నం మూలంగా కేంద్ర రహదారులు, భవనాల శాఖ ద్వారా కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి అనుమతులను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. శంకర్‌విలాస్ వంతెన డిజైన్లు, ట్రాఫిక్ మళ్లింపు వంటి అంశాలపై పెమ్మసాని దృష్టి సారించి పలు విడతలుగా అధికారులతో చర్చలు జరుపుతున్నారు. ఆర్వోబీ పనులకు త్వరలో శంకుస్థాపన కూడా చేసేలా పెమ్మసాని పనులను వేగవంతం చేయిస్తున్నారు.

పీవీ 13 రాష్ట్రాల ప్రజల ఆకలి బాధ తీర్చారు

● వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు



ఉత్తమ పరిశోధనా సంస్థలకు అవార్డులు అందజేస్తున్న వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావు, యూనివర్సిటీ వీసీ డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మిదేవి, యూనివర్సిటీ పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణ

గుంటూరు సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలోని 13 రాష్ట్రాల ప్రజల ఆకలి బాధను తీర్చిన ఘనత ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీ పరిశోధన సంచాలకులు డాక్టర్ పీవీ సత్యనారాయణకు దక్కుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ ఎస్ ఢిల్లీరావు అన్నారు. డాక్టర్ పీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో వచ్చిన వరి వంగడాలు 13 రాష్ట్రాల్లోని 14.15 మిలియన్ హెక్టార్లలో సాగు అవుతున్నాయని అన్నారు. ఇంత గొప్ప పరిశోధకులు ఉండటం వ్యవసాయ యూనివర్సిటీ అదృష్టం అన్నారు. గుంటూరు సమీపంలోని లాంలో ఉన్న ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కృష్ణా ఆడిటోరియంలో రెండు రోజుల పాటు జరగనున్న 54వ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశాలు బుధవారం ఆరంభం అయ్యాయి. కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరైన ఢిల్లీరావు మాట్లాడుతూ శాస్త్రవేత్తలు సునిశిత పరిశీలనతో సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకుంటూ దానికి తగ్గ పరిశోధనని నూతనంగా ఆలోచించి పరిష్కారం చూపించాలని అన్నారు. వీసీ డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మిదేవి మాట్లాడుతూ 2023లో విశ్వవిద్యాలయం నుంచి తొమ్మిది కొత్త వంగడాలు రాష్ట్రస్థాయిలోనూ, 10 కొత్త వంగడాలు జాతీయస్థాయిలోనూ విడుదల కావడం గర్వకారణమన్నారు. విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివ నారాయణ మాట్లాడుతూ 26 విస్తరణ విభాగాల ద్వారా 2023-24వ సంవత్సరంలో చేపట్టిన వివిధ విస్తరణ కార్యక్రమాల వివరాలను ను తెలియజేశారు. కార్యక్రమంలో ఉత్తమ సామర్థ్యం చూపించిన సంస్థలను గుర్తించి, సత్కరించారు. కొన్ని పుస్తకాలను విడుదల చేశారు. పాడేరు ఏరువాక కేంద్రానికి చెందిన ఎఎస్ఆర్ మొబైల్ యాప్‌ను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఉత్తమ ప్రాంతీయ పరిశోధనాస్థానం, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రంగా - లాం, గుంటూరు, ఉత్తమ వ్యవసాయ పరిశోధనాస్థానంగా -ఎఆర్ఎస్, రాగోలు, ఉత్తమ కృషి విజ్ఞాన కేంద్రంగా కేవీకే కొండెంపూడి, ఉత్తమ ఏరువాక కేంద్రంగా- ఏరువాక కేంద్రం, ఏలూరు లను గుర్తించి సన్మానించారు. మాజీ పరిశోధన సంచాలకులు డా.ఏ.ఎస్. రావు, మాజీ అసోసియేట్ డీన్ డా.ఆర్.ఎల్.వాసంతి, మాజీ విస్తరణ సంచాలకులు డా.పి.రాంబాబు, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ పామ్ రీసెర్చ్, పెదవేగి నుంచి డా.ఎం.వి. ప్రసాద్, ప్రధాన శాస్త్రవేత్త (విస్తరణ) తదితరులు పాల్గొన్నారు.

● 20 ఇంజనీరింగ్ పనులకు పరిపాలనా అనుమతులు
● ఇప్పటికే రూ.20 వేల కోట్ల పనులకు ఆమోదం
● సంక్రాంతి తర్వాత ఊపందుకోనున్న టెండర్ల ప్రక్రియ
● మార్చిలో పనులు ప్రారంభించే అవకాశం

అమరావతిలో మరో రూ.11,467 కోట్ల పనులకు ఆమోదం



విజయవాడ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణ పనులకు సంబంధించి మరో రూ.11,467.27 కోట్ల విలువైన పనులకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అనుమతులు జారీ చేసింది. రాజధానిలో అత్యంత కీలకమైన 20 ఇంజనీరింగ్ పనులకు బుధవారం ఆమోదం తెలిపింది. అమరావతిలో నిర్మాణ పనులకు సంబంధించి కిందటి కేబినెట్ సమావేశంలో రూ.21 వేల కోట్ల పనులకు ఆమోదం తెలిపింది. కేబినెట్ ఆమోదం ప్రకారం అందులో సగం రూ.11,467.27 కోట్ల పనులకు తాజాగా పరిపాలనా అనుమతులు జారీ చేసింది. మిగిలిన సగం పనులకు మరికొద్ది రోజుల్లో పరిపాలనా అనుమతులు జారీ చేసే అవకాశం ఉంది. ఇప్పటి వరకు మొత్తం రూ.31 వేల కోట్ల పనులకు పరిపాలనా ఆమోదం లభించింది. ఇప్పటికే అమరావతిలో రూ.20 వేల కోట్ల పైచిలుకు వ్యయంతో కూడిన పనులకు పరిపాలనా ఆమోదం లభించింది. ఈ మేరకు సీఆర్‌డీఏ కూడా టెండర్ల ప్రక్రియను చేపట్టింది. ఇప్పటి వరకు రూ.10 వేల కోట్ల మేర పనులకు సీఆర్‌డీఏ, ఏడీసీలు టెండర్లు పిలిచాయి. దీంతో సంక్రాంతి తర్వాత అమరావతిలో నిర్మాణ పనులు జరగటానికి ఆస్కారం ఏర్పడింది. అమరావతిలో కీలకమైన ట్రంక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పనులను రెండేళ్లలో పూర్తి చేసేలా నిర్దేశిస్తూ టెండర్లను పిలిచారు. మిగిలిన అన్ని పనులనూ మూడేళ్లలో పూర్తి చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ, ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు (ఏడీబీ)ల నుంచి తీసుకున్న అప్పులతో రాజధాని పనులను పరిగెత్తించేందుకు సీఆర్‌డీఏ టెండర్లు పిలుస్తోంది. సంక్రాంతి నాటికి రాజధానిలో రూ.43 వేల కోట్ల మేర పరిపాలనా ఆమోదాలు పూర్తి చేసుకుని మార్చిలో పనులు పురోగతిలోకి వచ్చే అవకాశం ఉంది.

ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం



ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఏఐవైఎఫ్ నాయకులు

గుంటూరు(తూర్పు), జనవరి 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలతో నిరుద్యోగ సమస్య నానాటికి పెరిగిపోతుందని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్రబాబు అన్నారు. స్థానిక కొత్తపేట మల్లయ్య లింగం భవన్లో బుధవారం 21వ ఏఐవైఎఫ్ జిల్లా మహాసభ జరిగింది. సభకు సీపీఐ నాయకులు జంగాల చైతన్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పరుచూరి రాజేంద్రబాబు మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వాలు ఘోరంగా వైఫల్యం చెందాయని అన్నారు. ముఖ్యంగా బీజేపీ ప్రభుత్వం యువతను భావోద్వేగాలతో రెచ్చగొట్టి అ శాంతి పరిస్థితులను సృష్టించడం తప్ప, దేశంలోని యువతకు కావాల్సిన ఏ ఒక్క ప్రయోజనకర విధానాలను తీసుకురాలేదని విమర్శించారు. రాష్ట్రంలో డీఎస్సీ నిర్వహణలో కాలయాపన చేస్తుందని విమర్శించారు. ఏఐవైఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లాల్లో పరిశ్రమలు, ప్రాజెక్టులు ఏర్పాటు చేయలేదని, దీంతో నిరుద్యోగం పెరిగిపోతుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ముఖ్యంగా వలంటీర్లను విధుల్లోకి తీసుకొవాలన్నారు. అనంతరం విద్యార్థులతో కొత్తపేట బోస్ సెంటర్ నుంచి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు బందేల నాసర్ జీ, షేక్ సుభాని, మహంకాళి సుబ్బారావు, షేక్ గని, జాన్సన్ బాబు, కోటా మాల్యాద్రి, మేడా హనుమంతురావు, అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల వద్ద ఉన్న ధాన్యం కొనుగోలు చేయాలి

- ఎమ్మెల్యే ధూళిపాళ్ళ



పొన్నూరుటౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద ఉన్న మొత్తం ధాన్యం కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ జిల్లా అధికారులను కోరినట్లు బుధవారం తెలిపారు. ఇటీవల జాయింట్ కలెక్టర్ ఎ. భార్గవ్ తేజను కలిసి ధాన్యం కొనుగోళ్లపై చర్చించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా రైతులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను అధికారుల ముందు ఉంచినట్లు చెప్పారు. ధాన్యం కొనుగోళ్లను పొన్నూరు నియోజకవర్గంలో నిలిపివేసినట్లు చెప్పారు. ధాన్యంకు సంబంధించి పేమెంట్లు ప్రభుత్వం తక్షణమే చెల్లిస్తుందని కానీ ధాన్యం కొనుగోలు నిలిపి వేయడం వలన రైతుల వద్ద అధిక సంఖ్యలో ధాన్యం నిల్వలు ఉన్నట్లు చెప్పారు. రైతులు తమ ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను సంప్రదిస్తే అలాట్మెంట్ లేదని అధికారులు చెప్పటం సరికాదన్నారు. వ్యవసాయ శాఖ అధికారులతో సమన్వయం చేసుకొని రైతుల పండించిన ధాన్యం వివరాలను సేకరించి మొత్తం ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. చేబ్రోలు, పొన్నూరు మండలాల్లో ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై జాయింట్ కలెక్టర్ భార్గవతేజ ధాన్యం కొనుగోళ్లు మొత్తం చేస్తామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ తెలిపారు. రైతుల వద్ద ఉన్న మొత్తం ధాన్యం కొనుగోలు చేసేలా ప్రభుత్వంతో సంప్రదించనున్నట్లు తెలియజేశారు.

10, 11, 12న నరెడ్కో మెగా ప్రాపర్టీషో-2025



ప్రాపర్టీ షో వివరాలు వెల్లడిస్తున్న నాయకుడు తిరుపతిరావు తదితరులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నరెడ్కో కాపిటల్ జోన్, గుంటూరు 12వ మెగా ప్రాపర్టీషో ఈ నెల 10, 11, 12 తేదీల్లో చేబ్రోలు హనుమయ్య ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్ గద్దె తిరుపతిరావు వెల్లడించారు. ఈ మేరకు బుధవారం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం ప్రాముఖ్యత, ఆకర్షణను పెంచుతుందనీ, ప్రాపర్టీషోకు ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రానున్నట్లు వివరించారు. ప్రాపర్టీ షో కార్యక్రమంలో మంత్రి నారాయణ, లోకల్ ఎమ్మెల్యేలు, తదితర ప్రముఖులు కూడా పాల్గొంటారని తెలిపారు. జనవరి 12న ముగింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. నారెడ్కో చైర్మన్ హీరానందని, నేషనల్ ప్రెసిడెంట్ గడ్డిపాటి హరిబాబు, స్టేట్ ప్రెసిడెంట్ చక్రధర్, మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాపర్టీషోలో 150 స్టాల్స్ ఏర్పాటు చేశామని, వీటిలో బిల్డర్స్, రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు, జాతీయ బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు, బిల్డింగ్ మెటీరియల్ సప్లయర్స్ పాల్గొంటారని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మామిడి సీతారామయ్య, క్యాపిటల్ జోన్ ప్రెసిడెంట్ నాగవంశీ, సెక్రెటరీ శ్రీనాథ్, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాస్ కుమార్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గుంటూరు కళాపరిషత్ నాటక సంబరాలు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ఆలోకం పెద్దబ్బయ్య, నాయుడు గోపి

గుంటూరు(తూర్పు), జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక వేంకటేశ్వర విజ్ఞాన మందిరం వేదికగా ఈ నెల 10వ తేదీ నుంచి మూడు రోజుల పాటు గుంటూరు కళా పరిషత్ వార్షిక నాటక సంబరాలు నిర్వహిస్తున్నట్లు కళాపరిషత్ గౌరవ సలహాదారుడు అలోకం పెద్దబ్బయ్య, ఉపాధ్యక్షుడు నాయుడు గోపి తెలిపారు. విజ్ఞాన మందిరం ఆవరణలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో నాటికలకు సంబంధించిన ఆహ్వానపత్రికలను ఆవిష్కరించి, వివరాలను వెల్లడించారు. 10న సిటీ వాకర్స్ అసోసియేషన్ గుంటూరు వారిచే 'స్వేచ్ఛ', శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరి వారిచే 'జనరల్ బోగీలు', కళానికేతన్ వీరన్నపాలెం వారిచే 'ఋతువులేని కాలం', 11న గంగోత్రి, పెదకాకాని వారిచే 'అష్టమ వసువు', 12న మిత్ర క్రియేషన్స్ హైదరాబాదు వారిచే 'మట్టిమనిషి' సాంఘిక నాటికలను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. ప్రదర్శనలతో పాటు ప్రతిరోజూ సభా కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమాలు 10, 11 తేదీల్లో సాయంత్రం 6.30 గంటలకు, 12న ఉదయం 10 గంటలకు సి.నాగభూషణం నట ప్రస్థానం సదస్సు జరుగుతుందని చెప్పారు. నాటకాలను తిలకించి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో పరిషత్ సభ్యులు పి.మల్లికార్జునరావు, బి.పూర్ణ, గుమ్మడి నాగేశ్వరరావు, షేక్ సైదా, ఆవుల సుబ్బారావు, రావుల అంజిబాబు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షల్లో 169 మంది ఎంపిక

గుంటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరుగుతున్న కానిస్టేబుళ్ల దేహదారుఢ్య పరీక్షల్లో బుధవారం 169 మంది అభ్యర్థులు తదుపరి పరీక్షలకు ఎంపికయ్యారు. మొత్తం 305 మంది హాజరుకాగా 74 మంది సంబంధిత ధ్రువపత్రాలు లేకపోవడంతో వెనుతిరిగారు. ఒకరు పరుగుపందెంలో పాల్గొనలేదు. మిగిలిన 206 మంది అభ్యర్థులకు శరీర కొలత పరీక్షలు నిర్వహించగా వారిలో 24 మంది ఛాతి, ఎత్తు తదితర కొలతలు సరిపోకపోవడంతో వల్ల తిరస్కరింపబడ్డారు. మిగిలిన 242 మందికి 1600 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా 27 మంది విఫలమయ్యారు. 179 మందికి 100 మీటర్ల పరుగు పందెం నిర్వహించగా వారిలో 100 మంది అర్హత సాధించారు. కాగా 179 మందికి లాంగ్ జంప్ నిర్వహించగా వారిలో 169 మంది అర్హత సాధించగా 11 మంది విఫలమయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు సుప్రజ, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119,127,137
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

వైసీపీ నేత అరెస్టు.. రిమాండ్

● ఒంటరి మహిళలే లక్ష్యంగా మోసాలు

గుంటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఒంటరి మహిళలను టార్గెట్ చేసి మోసాలు పాల్పడుతున్న హైకోర్టు న్యాయవాది, వైసీపీ నాయకుడు బరిగల కోటేష్ అనే వ్యక్తిని అరెస్టు చేసినట్లు అరండల్‌పేట పోలీసులు తెలిపారు. నగరంలోని అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ ప్రాంతానికి చెందిన పద్మావతి అనే మహిళ భర్త నుంచి విడిపోయి ఒంటరిగా ఉండగా పెళ్లి పేరుతో మంగళగిరి మండలం నవులూరుకు చెందిన కోటేష్ లోబరుచుకున్నాడు. పెట్రోల్ బంకులో వాటా ఇస్తానని చెప్పి పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకున్నాడు. అయితే వాటా ఇవ్వకపోవడంతో ఆమె డబ్బు తిరిగి ఇవ్వాలని అడగడంతో ఆమెతో గొడవ పెట్టుకున్నాడు. ఈ క్రమంలో బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు బుధవారం కోటేష్‌ను అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్ విధించడంతో ఆయనను జిల్లా జైలుకు తరలించారు.

విగ్రహం ఏర్పాటు వివాదాస్పదం

గుంటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాయలసీమకు చెందిన స్వాతంత్ర్య సమర యోధుడు, వడ్డెర సంఘం నాయకుడు ఓబన్న విగ్రహం ఏర్పాటు వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఈ నెల 11 ఆయన జయంతి ఉత్సవాలు ఘనంగా జరపాలంటూ ప్రభుత్వం ఇప్పటికే జీవో జారీ చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి వడ్డెర సంఘం నాయకులు మల్లె ఈశ్వరరావు, సంఘ జిల్లా అధ్యక్షుడు జాన్ సైదా, నాయకులు బుధవారం రాత్రి మెడికల్ క్లబ్ సమీపంలోని వీఐపీ రోడ్డులో విగ్రహం ఏర్పాటుకు దిమ్మె నిర్మించారు. ట్రాఫిక్ రద్దీగా ఉండే ప్రాంతంలో విగ్రహం ఏర్పాటుకు కమిషనర్ అభ్యంతరం చెప్పి దిమ్మెను తొలగించాలని ఆదేశించారు. విషయం తెలుసుకున్న వెస్ట్ డీఎస్పీ జయరాం ప్రసాద్, సీఐలు నజీర్‌బాషా, వీరాస్వామితో పాటు పోలీసులు అక్కడకు చేరుకుని దిమ్మెను తొలగించారు. విగ్రహాన్ని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో భద్రపరిచారు.

70,663 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 9 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 68,127 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 70,663 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 52,849 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఏసీ కామన్ వెరైటీ		
334	7200	14000	334	7500	13500
నంబరు. 5	8500	11000	నంబరు. 5	8000	11500
273	7500	9000	273	--	--
341	8500	15800	341	9000	14000
4884	8000	12500	4884	--	--
సూపర్ 10	--	--	సూపర్ 10	--	--
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	7800	16500	తేజ	8000	16000
బ్యాడిగి	7500	13000	బ్యాడిగి	9500	11500
దేవనూరుడీలక్స్	9500	14500	దేవనూరుడీలక్స్	13000	13000
తెల్లకాయలు	4000	10500	తెల్లకాయలు	4000	9500

గుంటూరు సిటీ వార్తలు

• గుంటూరు తూర్పు • పశ్చిమ

ట్రామా నోడల్ ఆఫీసర్‌గా డాక్టర్ నారాయణరావు

గుంటూరు మెడికల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రి క్యాజువాల్టీ విభాగం ట్రామా నోడల్ ఆఫీసర్‌గా ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ వీవీ నారాయణరావును నియమిస్తూ బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ రమణ ఎస్ఎస్‌వీ ఆదేశాలు జారీ చేశారు. ఇకపై ప్రతిరోజూ డాక్టర్ నారాయణరావు క్యాజువాల్టీ వార్డును సందర్శించి అక్కడ ట్రామా పని వ్యవస్థను పర్యవేక్షిస్తారు. అత్యవసర వైద్యం కోసం క్యాజువాల్టీకి వచ్చే రోగులకు సత్వరం వైద్య చికిత్సలు అందుతున్నాయా లేదా అనే విషయాన్ని ఆయన పర్యవేక్షిస్తారు. డ్యూటీ డాక్టర్లకు, సిబ్బంది నిర్ధేశిత సమయంలో అందుబాట్లో ఉంటున్నారా? అనే విషయం పరిశీలిస్తారు. బాధితులకు వెంటనే వైద్య చికిత్సలు అందించేలా చర్యలు తీసుకుంటారు. ట్రామాకి సంబంధించిన 51 మంది సిబ్బందికి శిక్షణ ఇవ్వడం, వారి విధులను పర్యవేక్షించడం ట్రామా నోడల్ ఆఫీసర్‌గా డాక్టర్ నారాయణరావు బాధ్యత అని రమణ యశస్వి తెలిపారు.


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ అనిత తదితరులు

నేషనల్ ఇంటిగ్రేషన్ క్యాంపునకు టీజేపీఎస్ విద్యార్థిని ఎంపిక

గుంటూరు(విద్య),జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక టీజేపీఎస్ కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జాస్మిన్ కర్ణాటకలోని గుల్బర్గా విశ్వవిద్యాలయంలో జరిగే ఇంటిగ్రేషన్ క్యాంపునకు ఎంపికైంది.ఈ విషయాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14వ తేదీ నుంచి 21 వరకు జరగే ఇంటిగ్రేషన్ క్యాంపులో ఆమె పాల్గొంటుందని పేర్కొన్నారు. కళాశాల కార్యదర్శి కేవీ బ్రహ్మం, అధ్యక్షుడు పోలిశెట్టి శ్యాం సుందర్, నాగ సుందరం, జాతీయ సేవా పథకం కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్, కార్యక్రమ నిర్వహణ అధికారి ఆర్ జయ శైలజ అభినందించారు.

విజ్ఞానంద బాల కుటీర్ వార్షికోత్సవం

గుంటూరు(విద్య),జనవరి 8(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని గుంటూరు కాంపిటీషన్స్ వ్యవస్థాపకుడు బైరిశెట్టి మల్లికార్జునరావు అన్నారు. స్థానిక అమరావతి రోడ్డులోని శ్రీరస్తు కన్వెన్షన్ హాలులో బుధవారం జరిగిన విజ్ఞానంద బాల కుటీర్ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన మాట్లాడారు. మల్లికార్జునరావు మాట్లాడుతూ సాధారణ విద్యార్థులతో అత్యుత్తమ ఫలితాలను సాధిస్తున్న విజ్ఞానంద బాలకుటీర్ యాజమాన్యాన్ని ప్రశంసించారు. టీజేపీఎస్ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ పి.రాధాబాయి, గుంటూరు అమెరికన్ ఆంకాలజీ ఇనిస్టిట్యూట్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజీ వైద్యులు హర్ష దీప్తి, స్కూల్ డైరెక్టర్ చిన్నం సాంబశివరావు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సుందరకాండ హోమం

గుంటూరు(తూర్పు), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతీనగర్‌లోని మారుతీ దేవాలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న శ్రీరామ మహాసామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదవరోజున బుధవారం సుందరకాండ హోమం నిర్వహించారు.

శివారు ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం


రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే గళ్లా మాధవి

గుంటూరు కార్పొరేషన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో నిర్లక్ష్యానికి గురైన డివిజన్లలో ఎమ్మెల్యే గళ్లా మాధవి అభివృద్ధి బాటలు వేస్తున్నారు. అభివృద్ధికి నోచుకోని శివారు ప్రాంతాలపై దృష్టి పెట్టి కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులకు ఆమె శ్రీకారం చుట్టారు. స్థానిక 21వ డివిజన్‌లో రూ.1 కోటి 91 లక్షల 40 వేల నిధులతో బుధవారం సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో భారీ నిధులతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయడం ఆనందంగా ఉందని, తొలి నుంచి అభివృద్ధికి నోచుకోని శివారు ప్రాంతాలపై దృష్టి పెట్టానని అన్నారు. ఇందులో భాగంగానే నిత్యం అభివృద్ధి పనులపై సమీక్షలు చేసి, పనులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల ప్రచార సమయంలో తాను ఈ డివిజన్ లోకి వచ్చినప్పుడు కనీసం సరైన రోడ్లు లేవని, పారిశుధ్యం పడకవేసిందని, దీని వలన తాము తీవ్ర అనారోగ్యాలకు గురవుతున్నామని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారని, గెలిచిన అనంతరం క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలను పరిశీలించినట్లు చెప్పారు. ఈ డివిజన్‌లో మెగా శానిటరీ డ్రైవ్ నిర్వహించానని, నిత్యం డ్రైనేజీ తొలగింపు జరుగుతున్నాయన్నారు. డివిజన్‌లో మంచినీటి సమస్యను కూడా పరిష్కారించామన్నారు. గత సంవత్సరం ఆగస్టులో కోదండ రామయ్యనగర్ 2,3 లైన్లలో రూ.80 లక్షలతో 600 మీటర్ల సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తుచేశారు. 21వ డివిజన్‌ను ఆదర్శవంతమైన డివిజన్‌గా తయారు చేస్తానన్న మాటకు కట్టుబడి, అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చెప్పారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఎక్కడా కూడా రోడ్ల, డ్రైన్ల సమస్యలు లేకుండా, నియోజకవర్గం మొత్తం అభివృద్ధి చేస్తానన్ని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చిన్న మస్తాన్ వలి, చెన్నంశెట్టి శ్రీకాంత్, కంచర్ల సాంబశివరావు,కదిరి సంజయ్,ఆళ్ల హరి,విజయ లక్ష్మి, బాబు ఖాన్ పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు


ప్రజలతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 8 (ఆంధ్ర జ్యోతి): ప్రజలు తమ స్థానిక సమస్యల పరిష్కారం కోసం అందించే అర్జీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, సమస్యను సమ గ్రంగా పరిశీలించి, శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. కమిషనర్ పీజీ ఆర్ఎస్, 'డయల్ యువర్ కమిషనర్' కి బుధవారం ప్రజల నుంచి అర్జీలు అందాయి. నల్లచెరువు, లక్ష్మీనగర్, సాయి నగర్, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించిన కమిషనర్, అర్జీదారులతో మాట్లాడారు. ఆయా సమస్యలపై చర్చించి, పరిష్కార చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ పర్యటనలో ఎంహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, డిఈఈలు మధుసూధనరావు, రమేష్ బాబు, ఏఎంహెచ్ఓ రాం బాబు, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాలు విజయవంతం చేయాలి

నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో తెలుగు సంప్రదాయాలను నేటి తరానికి తెలియజేసేలా సంక్రాంతి సంబరాలను నిర్వహించనున్నట్లు జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. సంక్రాంతి సంబరాల ఏర్పాట్లపై జీఎంసీ కౌన్సిల్ సమావేశ మందిరంలో బుధవారం ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సంబరాలను విజయవంతం చేయడానికి ప్రత్యేకంగా అధికారులు, పుర ప్రముఖులతో ఏర్పాటు చేసిన ఆర్గనైజింగ్ కమిటీలు కృషి చేయాల చెప్పారు. కమిషనర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియంలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాలతో 4 రోజుల పాటు సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించనున్నామన్నారు. ప్రత్యేకంగా వాట్స్ అప్ గ్రూప్ ఏర్పాటు చేయాలని, ఎప్పటికప్పుడు వివరాలను ఆ గ్రూప్‌లో పోస్ట్ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిష నర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, టి.వెంకట కృష్ణయ్య, ఎస్ఈ నాగమల్లేశ్వర రావు, డీసీపీ సూరజ్ కుమార్, ఎన్టీఆర్ స్టేడియం మాజీ అధ్యక్షుడు డి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షిలో థీమ్యాటిక్ ఎగ్జిబిషన్

గుంటూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేటలోని లేపాక్షి హస్తకళల ఎంపోరియంలో ఈ నెల 6న ప్రారంభమైన థి మ్యాటిక్ ఎగ్జిబిషన్‌లో చేతి వృత్తుల వారు స్వయంగా తయారు చేసిన వస్తువుల అమ్మకాలు జరుపుతున్నట్లు మేనేజర్ ఎమ్‌వీఎస్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10 వ తేదీ వరకు అమ్మకాలు కొనసాగుతాయన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, కలంకారి, లెదర్ పప్పెట్, దుర్గి స్టోన్‌బొమ్మలు అమ్మకానికి ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్, పక్కన ఆలపాటి రాజా తదితరులు

ఆలపాటి గెలుపు.. యువత అభివృద్ధికి మేలిమలుపు: ఎమ్మెల్యే నసీర్

గుంటూరు కార్పొరేషన్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లచెరువు వాకింగ్ ట్రాక్ వద్ద గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్, టీడీపీ కూటమి తరఫున పోటీ చేస్తున్న గుంటూరు, కృష్ణా జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజా బుధవారం వాకింగ్‌కు వచ్చిన ప్రజలతో మమేకమయ్యారు. వాకర్స్‌ను ఆప్యా యంగా పలక రించారు. పట్టభద్రులు, ఉద్యోగులతో మాటామంతీ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వ్యాయామానికి సమయం కేటాయిస్తున్నందుకు అభినందనలు తెలియజేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రజలతో చర్చించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయనకు మద్దతుగా నిలవాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా రాజకీయ అనుభవం ఉన్న ఆలపాటి గెలుపు గుంటూరు జిల్లా అభివృద్ధికి మేలిమలుపుగా మారుతుందని వివరించారు. విద్యావంతులు ఆలోచించి ఆంధ్రప్రదేశ్ ఉజ్వల భవిష్యత్తుకు ఆలపాటి రాజాను పెద్దల సభకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వేముల జ్యోతి,చిస్టీ, చౌదరి శీను, చల్లా ఆంజనేయ ప్రసాద్, మాల కొండయ్య, రవి, వహీద్, చిన్న బుజ్జి వేముల శీను, ఫిరోజ్, వీరారెడ్డి,వాణి పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఐలాండ్‌కు కొత్త రూపు

గుంటూరులోని బస్టాండ్ ప్రాంతం వద్ద ఉన్న ఎన్టీఆర్ ఐలాండ్ కు కొత్త రూపు తీసుకొచ్చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, దీని కోసం ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని ఎమ్మెల్యే నసీర్ తెలిపారు. గుంటూరులోని బస్టాండ్ వద్ద ఎన్టీఆర్ సర్కిల్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ట్రాఫిక్ కూడా ఎక్కువగా ఉంటోందని తెలిపారు.

కూటమి ప్రభుత్వంతోనే మైనారిటీల సంక్షేమం

కూటమి ప్రభుత్వంతోనే మైనారిటీల సంక్షేమం సాధ్యమని, అధికారం చేపట్టిన కొన్ని నెలల్లోనే మైనారిటీలకు సీఎం చంద్రబాబు పెద్దపీట వేశారని ఎమ్మెల్యే అన్నారు. స్థానిక ఆనందపేటలో ముస్లిం శ్మశాన వాటికతోపాటు పరిసర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని ప్రతి సమస్యనూ ప్రాధాన్యతాక్రమంలో పరిష్కరిస్తున్నామని వెల్లడించారు. ముస్లిం శ్మశాన వాటిక అభివృద్ధికి త్వరలోనే చర్యలు చేపట్టనున్నామని రానున్న నెల రోజుల్లో రూపురేఖలు మారుస్తామని అన్నారు. అక్కడ ఉన్న ముస్లిం పెద్దలతో ఎమ్మెల్యే నసీర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ చిస్టీ,శంకరి శీను, మీరావలి, సలీం, హఫీజ్,జమీర్,అన్వర్, చిన్న బుజ్జి పాల్గొన్నారు.

ఏఎన్‌యూ ఉపకులపతి ఎంపికకు సెర్చ్ కమిటీ నియామకం

గుంటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం(ఏఎన్‌యూ) ఉపకులపతిని ఎంపిక చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సెర్చ్ కమిటీని నియమించింది. మొత్తం ముగ్గురి పేర్లను సూచించాల్సిందిగా ఆదేశించింది. సెర్చ్ కమిటీలో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ పూర్వ వీసీ డాక్టర్ సీవీ రావు, గీతమ్ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కే శివరామకృష్ణ, యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి ఆచార్య సంజీవ్ జైన్‌ని నియమించింది. ఈ త్రిసభ్య కమిటీ అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకొని ఈ ముగ్గురి పేర్లను సిఫార్సు చేస్తుంది. ఆ ముగ్గురిలో ఒకరిని వీసీగా ఎంపిక చేస్తారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ సెక్రెటరీ కోన శశిధర్ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.

కొనసాగుతున్న సద్ది


స్వాములకు హారతి ఇస్తున్న ఆలయ పాలక మండలి అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య

గుంటూరు(తూర్పు), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో ఆలయ పాలకమండలి, ధార్మిక విజ్ఞాన్ పరిషత్ దాతల, భక్తుల సంయుక్త ఆధ్వర్యంలో ధార్మిక ప్రాంగణంలో స్వాములకు సద్ది కార్యక్రమం కొనసాగుతోంది. ఆలయ కమిటీ అధ్యక్షుడు చిట్టిపోతు మస్తానయ్య, ధార్మిక విజ్ఞాన్ పరిషత్ అధ్యక్షుడు బొలేపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ డిసెంబరు 27 నుంచి ఈ నెల 14 వరకు సద్ది కొనసాగుతోందని, స్వాములు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 10న ముక్కోటి ఏకాదశి పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో స్వామి వారికి లక్ష్మీగణపతి నవగ్రహ రుద్రాభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణ, ఆదిత్య హృదయ పారాయణ జరుగుతున్నాయని తెలిపారు.


కలెక్టరేట్ ఎదుట నిరసనలో పాల్గొన్న అంగన్వాడీలు

ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టులను భర్తీ చేయాలి

● అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సుబ్బరావమ్మ

గుంటూరు (తూర్పు) జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖాళీగా ఉన్న అంగ న్వాడీ పోస్టులను భర్తీ చేయా లని, సమ్మె కాలపు ఒప్పం దాలను అమలు చేయాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే సుబ్బరావమ్మ డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ఎదుట జరుగుతున్న దీక్షలు బుధవారం నాటికి మూడో రోజుకు చేరాయి. ఈ దీక్షలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా సుబ్బరావమ్మ మాట్లాడుతూ జిల్లాలో 39 వర్కర్స్ 66 హెల్పర్ల మొత్తం 105 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, గత ఏడాది కాలంగా ఐసీడీఎస్ అధికారులకు, కలెక్టరుకు అనేక సార్లు వినతిపత్రాలు ఇచ్చినప్పటికి సమస్య పరిష్కరించకపోవడం వల్లే ఆందోళనకు దిగాల్సి వచ్చిందని అన్నారు. జిల్లా మినహా మిగతా రాష్ట్ర మంతటా ఖాళీ పోస్టులను గుర్తించి నోటిఫికేషన్ విడుదల చేసి నియామకాలు చేపట్టినప్పటికీ మన జిల్లాలో ఈ ప్రక్రియ చేపట్టకపోవడానికి కారణాలేంటని ప్రశ్నించారు. జిల్లాలో అనేకచోట్ల అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తక్షణమే కూటమి ప్రభుత్వం అంగన్వాడీలకి ఇచ్చిన హామీల అమలుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుతో కలసి కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. పలు సంఘాల నాయకులు దండా లక్ష్మీనారాయణ, రాధాకృష్ణ, బి శ్రీనివాసరావు, అంగన్‌వాడీలు దీప్తి మనోజ, వెంకాయమ్మ, హేమలత తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితరులు

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు 'క్రాఫ్ టర్స్'

గుంటూరు(విద్య), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం నిర్వ హిస్తున్న ప్రత్యేక పోటీల ద్వారా చదువుతోపాటు వారిలో దాగి ఉన్న సృజనాత్మకతను, కళా నైపు ణ్యాలను వెలికి తీసేందుకు హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ చేపట్టిన 'క్రాఫ్ టర్స్' (బాలోత్సవ మేళ) విజయవంతం చేయాలని శాసనమండలి సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. స్థానిక అమరావతి రోడ్డులోని హిందూ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సమావేశ మందిరంలో కళాశాల ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1న నిర్వహించనున్న క్రాఫ్ట్ టర్స్ కార్యక్రమాల వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాశాల కార్యదర్శి, కరస్పాండెంట్ చెరువు రామ కృష్ణమూర్తి మాట్లాడుతూ కళాశాల అభివృద్ధిలో భాగంగా జిల్లా స్థాయిలో ఉన్నత పాఠశాలల విద్యార్థులకు క్విజ్, సింగింగ్, డాన్సింగ్, చేతిరాత, అనుకరణ, క్రాఫ్ట్, క్రియేటివ్, ఇమేజిన్ తదితర అంశాలలో పెద్దఎత్తున పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తా మన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వీ నర్సిరెడ్డి, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీఎం ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ దుర్గాప్రసాద్, వేణుగోపాల్ పాల్గొన్నారు

ఆరోగ్యసహాయకుల పునర్నియామకం కోసం కృషి

● ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు (తూర్పు), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగాల నుంచి తొలగించిన వైద్య ఆరోగ్య శాఖ లోని ఆరోగ్యసహాయకుల పునర్నియామకం కోసం ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరి ష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం ఎమ్మెల్సీ లక్ష్మణరావును ఆంధ్ర ప్రదేశ్ పారామెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జీవీవీ ప్రసాదు కలిసి వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా జీవీవీ ప్రసాదు మాట్లాడుతూ హైకోర్టు తీర్పు పేరుతో రాష్ట్రంలోని 920 మంది ఆరోగ్యసహాయకులను ఒక్కసారిగా ప్రభుత్వం తొలగించిందన్నారు. అదే హైకోర్టు చెప్పిన విధంగా మెరిట్ ఆధారంగా తిరిగి వారిని పునర్నియామకం చేసుకునే విషయంలో అలక్ష్యం చేస్తున్నారన్నారు. ఆరోగ్యసహాయకులను తొలగించి నెల రోజులు దాటిపోయినా నేటికి నియామకాలు జరగలేదన్నారు. ఇప్పటికే ఈ ఉద్యోగాలు తొలగింపుతో నలుగురు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ సమస్యపై వైద్యఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబుతో చర్చించి ఉద్యోగుల పునర్నియామకం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ పాల్గొన్నారు.

'తెలంగాణలో ఆటవిక రాజ్యమా? ప్రజాస్వామ్యమా?'

గుంటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ నేతృత్వంలో ఆటవిక రాజ్యం కొనసాగుతోందని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ ఒక ప్రకటనలో ఆక్షేపించారు. తెలంగాణ బీజేపీ కార్యాలయంపై కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు చేసిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికార పార్టీ కార్యకర్తలు దాడి చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించారు. దాడి చేస్తే చూస్తూ ఊరుకోమని పేర్కొన్నారు.రిపోర్టర్ ఆంజనేయులు


కారుణ్య నియామక పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

కారుణ్య నియామక ఉద్యోగులు కష్టపడి పనిచేయాలి

● కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి

గుంటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకం కింద ఉద్యోగాలు పొందిన వారు కష్టపడి పని చేసి ఆయా శాఖలకు మంచి పేరు తీసుకురావాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి సూచించారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ చనిపోయిన యండ్రపాటి బాలకృష్ణ కుటుంబానికి చెందిన తిరుమలేష్‌కు కారుణ్య నియామకం కింద స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో పోస్టింగ్ కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఉద్యోగాలు పొందిన వాళ్లు తమ పెద్దవాళ్లను కష్ట పెట్టకుండా జాగ్రత్తగా చూసుకోవాలని నాగలక్ష్మి సూచించారు.

బీసీలకు రుణాల మంజూరులో బ్యాంకర్లు లక్ష్యాలను అధిగమించాలి: డీఆర్వో


బ్యాంకర్ల సమావేశంలో పాల్గొన్న డీఆర్వో ఖాజావలి, బీసీ కార్పొరేషన్ ఈడీ, ఎల్‌డీఎం

గుంటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బీసీ, ఆర్థికంగా వెనకబడినవర్గాల కార్పొ రేషన్ రుణాల మంజూరులో బ్యాంకర్లు లక్ష్యాలను అధిగమించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్ షేక్ ఖాజావలి అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా సంప్రదింపుల కమిటీ సమావేశాన్ని ఆయన నిర్వ హించారు. డీఆర్వో మాట్లాడుతూ స్వయం ఉపాధి కల్పన పథకాలకు సంబం ధించిన వివరాలను బ్యాంకర్లకు తెలియ జేసి అర్హులైన లబ్ధిదారులకు రుణాలు ఇవ్వాలన్నారు. అభ్యర్థుల ఎంపి కని ఎంపీడీవోలు, మునిసిపల్ కమిషనర్ ద్వారా చేపడతామన్నారు. ఈ సమావేశంలో బీసీ కార్పొరేషన్ ఈడీ మయూరి, ఎల్‌డీఎం మహిపాల్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, జిల్లా పరిశ్రమల కేంద్ర మేనేజర్ జయలక్ష్మి పాల్గొన్నారు.




విద్యార్థినిలను అభినందిస్తున్న డీఈవో సీవీ రేణుక తదితరులు

సైన్స్ ప్రదర్శనలో సత్తా చాటిన జిల్లా విద్యార్థులు

● నాలుగు ప్రదర్శనలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక

గుంటూరు(విద్య),జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రదర్శనలలో జిల్లా విద్యార్థులు మరోసారి తమ సత్తాచాటారు. ఈ నెల 7, 8 తేదీల్లో విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా విద్యార్థుల నాలుగు ప్రాజెక్టులు జాతీయ స్థాయిలో జరిగే సదరన్ ఇండియా సైన్స్ ప్రదర్శనకు ఎంపికైనట్లు డీఈవో సీవీ రేణుక, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ గౌసుల్ మీరా బుధ వారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు పుదుచ్చేరిలో జరిగే సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొనే 35 ప్రాజెక్టులను ఎంపిక చేయగా అందులో నుంచి అత్యధికంగా నాలుగు ప్రాజెక్టులు గుంటూరు జిల్లాకు సంబంధించినవే ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను, గైడ్ టీచర్లను డీఈవో అభినందిం చారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా, గైడ్ టీచర్లు అరుణ కుమారి, రామాంజనేయులు, ఆరిఫ్ బేగ్, శివారెడ్డి భాస్కరరావు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు, గైడ్ టీచర్లు

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ప్రాజెక్టులు

విద్యార్థి వ్యక్తిగత విభాగంలో నారాకోడూరు ఉన్నత పాఠశాల విద్యార్థిని షేక్ నజ్మ- ప్రాజెక్టు: సర్వింగ్ రోబోట్, ముట్లూరు ఉన్నత పాఠశాల విద్యార్థి పవన్ దుర్గ- ప్రాజెక్టు: సోలార్ హెల్మెట్, విద్యార్థి గ్రూపు విభాగంలో ఎస్ఎస్ఎన్‌ఓ. హైస్కూల్, గుంటూరులోని శారదా నికేతనము విద్యార్థినిలు అనీసా బేగం, ఎస్. ఈర్చిత ప్రాజెక్టు: గగన్ యాన్ మిషన్, టీచర్ విభాగంలో జీజీ పాలెం హైస్కూల్ భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు గవిని శ్రీనివాసరావు- ప్రాజెక్టు: ఎలక్ట్రో మాగ్నటిజం.

ఎన్‌టీఏ క్యాలెండర్ ఆవిష్కరణ

గుంటూరు(విద్య),జనవరి 11(ఆంధ్రజ్యోతి): నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను డీఈవో సీవీ రేణుక బుధవారం ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఈ ఏడాది 10వ తరగతి ఫలితాలలో రాష్ట్రంలో గుంటూరు జిల్లాను ప్రథమ స్థానంలో నిలపడానికి ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేయా లని కోరారు. ఎన్‌టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొనిగల హైమారావు మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు జిల్లా పరిషత్ తరపున స్టడీ మెటీరియల్ , అల్పాహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు నడిపినేని వెంకట్రావు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, పల్నాడు జిల్లా అధ్యక్షులు సాంబశివ రావు, గుంటూరు జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖలీల్, గుంటూరు నగర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సాయి విశ్వనాథ్, పి.లలితబాబు, నాయకులు శీనివాసరావు, హరగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సంక్రాంతి శోభ

● పిండి వంటల ఘుమఘుమలు
● అరిసెలు, లడ్డూ తయారీలో మహిళలు
● హరిదాసుల సందడి
● గ్రామాలకు చేరుకుంటున్న బంధువులు



సంక్రాంతికి సిద్ధమైన అరిసెలు, లడ్డులు, పూస మిఠాయి | గ్రామాల్లో సంచరిస్తున్న హరిదాసు



వట్టిచెరుకూరులో సంక్రాంతికి అరిసెలు వండుతున్న గృహిణులు





వట్టిచెరుకూరులో చెక్కలు తయారు చేస్తున్న మహిళలు



వట్టిచెరుకూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినం సమీపిస్తున్న నేపథ్యంలో పిండి వంటల తయారీపై గృహిణులు దృష్టి సారించారు. పిండి వంటల ఘుమ ఘుమల గుబాళింపు ప్రతి ఇంట ప్రారం భమయ్యాయి. సంక్రాంతికి సంప్రదాయ బద్ధంగా కొత్తగా పెళ్ళయిన అల్లుళ్ళు, కూ తుళ్ళు, సుదూర ప్రాంతాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు చేస్తున్నవారు సంక్రాంతికి సొంత గ్రామాలకు చేరుకుంటారు. పిండి వంటల కోసం రెండు మూడు కుటుంబాలకు చెందిన మహిళలు ఒక చోట చేరి ఆయా కుటుంబాలకు అవసరమైన అరిసెలు, లడ్లు, పప్పు చెక్క, బూందీ, కారప్పూస, చెక్కలు వంటి వంటలను చేసుకుంటారు. సంక్రాంతి వస్తుందంటేనే ధనుర్మాసం ప్రారంభం నుంచి వంశపారంపర్యంగా వచ్చే హరిదాసులు సంప్రదాయ దుస్తులు ధరించి తలపై కలశం, తుంబురతో మరోచేతిలో భజన చెక్కలు మీటుకుంటూ గ్రామ సంచారం సాగిస్తుంటారు. ఇప్పటికే సంక్రాంతిని పురస్కరిం చుకొని కొన్ని గ్రామా లకు సుదూర ప్రాం తాల్లో నివసించే కూతు ళ్ళు, అల్లుళ్ళు, కుమారులు, కోడళ్ళు, మనువళ్ళు, మనుమ రాళ్ళు గ్రామాలకు చేరుకుంటున్నారు.

హ్యూమన్ మెటా న్యూరో వైరస్ పట్ల ఆందోళన వద్దు

● ఇది ఫ్లూ తరహా తరుణ వ్యాధే
● డీఎంహెచ్‌వో విజయలక్ష్మి వెల్లడి



డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మి

గుంటూరు మెడికల్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో హ్యూమన్ మెటా న్యూరో వైరస్ (హెచ్ఎంపీవీ) గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇది సీజనల్ ఫ్లూ తరహా తరుణ వ్యాధని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కే విజయలక్ష్మీ వెల్లడించారు. ఈ మేరకు బుధవారం హెచ్ఎంపీ వైరస్‌పై ప్రజావగాహన కోసం పత్రిక ప్రకటన విడుదల చేశారు. హ్యూమన్ మెటా న్యూరో వైరస్ సాధారణంగా ఐదేళ్ల లోపు పిల్లలకు, 60 ఏళ్లు పైబడ్డ వృద్ధులకు, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారికి, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సోకే అవకాశం ఉంటుందన్నారు. దీనికి విశ్రాంతి తీసుకుంటే సరిపోతుందని, ప్రత్యేక చికిత్సలు అంతగా అవసరం ఉండదని తెలిపారు. ఈ వైరస్‌ను 24 ఏళ్ల కిందటే గుర్తించారని, ఇది కొత్త వైరస్ కాదని ఆమె స్పష్టం చేశారు. వైరస్ ద్వారా సంక్రమించే వ్యాధులకు యాంటీ బయోటిక్ మందులు పని చేయవని, జలుబు, దగ్గుతో బాధపడే వారు ఈ మందులు వాడవద్దని ఆమె సూచించారు. చిన్నపాటి జాగ్రత్తలు పాటించడం వల్ల హ్యూమన్ మెటా న్యూరో వైరస్ బారిన పడకుండా రక్షణ పొందవచ్చని ఆమె తెలిపారు. తరచూ చేతులను సబ్బుతో శుభ్రపర్చుకోవడం, రద్దీ ప్రాంతాల్లో సంచరించే సమయంలో మాస్కులు . ధరించాలని తెలిపారు. మంచినీరు ఎక్కువగా తీసుకోవడం, తాజా పౌష్టికాహారం తీసుకోవడం, దగ్గు, జలుబు ఉన్న వారికి దూరంగా ఉండాలని డాక్టర్ విజయలక్ష్మీ తెలిపారు. ముక్కును, కళ్లను చేతులతో తాకవద్దని, ఇతరులతో కరచాలన చేయవద్దని వివరించారు. దగ్గు, జ్వరంతో బాధపడే పిల్లలను పాఠశాలకు పంపకుండా ఇంటిలో ఉంచి విశ్రాంతి ఇవ్వాలని తెలిపారు. పిల్లలకు సకాలంలో ప్రభుత్వం ఇచ్చే అన్ని రకాల వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ కోరారు.

రేపు నృసింహుని.. ఉత్తర ద్వార దర్శనం

● బంగారు దక్షిణావృత శంఖుతో భక్తులకు తీర్థం
● ఏర్పాట్లను పరిశీలించిన ఎస్పీ సతీశ్‌కుమార్

వైకుంఠ ఏకాదశి నాడు అన్ని ముఖ్య వైష్ణవాలయాలలో ఉత్తర ద్వార దర్శనం సంప్రదాయంగా కొనసాగుతోంది. తెలుగు నాట వెంకటాద్రి (తిరుమల), భద్రాద్రి, మంగళాద్రిలో ఈ ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. అయితే మంగళాద్రి క్షేత్రంలో మాత్రమే ఈ ఉత్సవానికి ప్రత్యేకతతో కూడిన గుర్తింపు వుంది. అత్యంత విలువైన... ఓంకార నాద జనితమైన బంగారు దక్షిణావృత శంఖుతో తీర్థప్రసాదాలను ఇవ్వడం ఈ క్షేత్ర విశిష్టత. ఈ కారణంగానే మంగళగిరి శ్రీలక్ష్మీనృసింహస్వామి ముక్కోటి ఉత్తర ద్వార దర్శనానికి భక్తులు విశేషంగా తరలివస్తుంటారు.

మంగళగిరి సిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మంగళాద్రి క్షేత్రంలో శ్రీ లక్ష్మీనృసింహస్వామి వారి ఉత్తర ద్వారదర్శన భాగ్యం పది గంటలకు పైగా సాగుతుంది. ప్రత్యేకించి ఇక్కడ జరిగే ముక్కోటి వేడుకలకు మరో ప్రాధాన్యం కూడా జతకలిసింది. అత్యంత అరుదైన దక్షిణావృత శంఖు ఒక్క మంగళగిరిలో మాత్రమే ఉంది. దీంతో మంగళాద్రిలో జరిగే శ్రీ లక్ష్మీనృసింహుని ఉత్తర ద్వార దర్శనానికి ఏటా ప్రజలు పోటెత్తుతారు. ముక్కోటి సందర్భంగా 9వ తేదీ గురువారం రాత్రి శ్రీవారిని జగన్మోహినిగా అలంకరించి పుష్పక విమానంపై గ్రామోత్సవం చేస్తారు. ఈ ఉత్సవానికి దుగ్గిరాల మండలం పెదపాలెంకు చెందిన వాసిరెడ్డి మల్లేశ్వరరావు శాశ్వత కైంకర్యపరులుగా వ్యవహరిస్తున్నారు. అనంతరం అర్ధరాత్రి నుంచి తెల్లవారుజామున అంటే పదవ తేదీ శుక్రవారం వేకువజామున మూడు గంటల వరకు శ్రీవారి మూలమూర్తికి తిరువంజనోత్సవం నిర్వహిస్తారు. ఈ తిరువంజనానికి అతి కొద్ది మంది భక్తులను మాత్రమే అనుమతిస్తారు. తిరువంజనం పూర్తవుతుండగానే.. శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీనృసింహస్వామి ఉత్సవ మూర్తులను బంగారు గరుడ వాహనంపై శోభాయమానంగా అలంకరించి ఉత్తర ద్వారంలోనికి ప్రవేశపెడతారు. ఈ వైకుంఠ దర్శనం శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల వరకు కొనసాగుతుంది. ఈ ఉత్సవానికి పెదపాలేనికే చెందిన వాసిరెడ్డి నాగార్జున శాశ్వత కైంకర్యపరులుగా వ్యవహరించనున్నారు. శ్రీవారి ఉత్తర ద్వార దర్శనం కొనసాగుతుండగా.. మరోవైపు ఆలయ ముఖమండపంలో బంగారు దక్షిణావృత శంఖుతో రాత్రి పది గంటల వరకు తీర్థప్రసాదాలను అందజేశారు. భక్తుల రద్దీని దృష్టిలో వుంచుకుని మర్నాడు శనివారం కూడా శంకుతీర్థం అందజేయనున్నారు.

ముక్కోటి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు: ఎస్పీ సతీశ్‌కుమార్

మంగళాద్రిలో రెండు రోజులపాటు జరుగనున్న ముక్కోటి ఉత్సవాలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్టు ఎస్పీ సతీశ్‌కుమార్ తెలిపారు. దేవస్థానం అధికారులతో కలిసి బుధవారం సాయంత్రం ఆయన ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీశ్‌కుమార్ మాట్లాడుతూ ముక్కోటి ఉత్సవాలకు లక్ష మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని, అందు కు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నామని చె ప్పారు. 60వేల మంది భక్తులు శంఖుతీర్థం తీసుకోవచ్చని అంచనా వేసి, వారి కోసం దేవస్థానం వారు ఉచిత క్యూలైను, రూ. వంద, రూ.200, వీఐపీ క్యూలైన్లను వేర్వేరుగా ఏర్పాటు చేశారన్నారు. 9వ తేదీ రాత్రి నుంచి పదో తేదీ రాత్రి వరకు 300 మంది పోలీసుసిబ్బంది బందోబస్తు విధుల్లో పాల్గొంటారన్నారు. దేవస్థానానికి మూడువైపులా మూడుచోట్ల పార్కింగ్ స్థలాలను కేటాయించామని, భక్తులు పార్కింగ్ స్థలాల్లో వాహనాలను నిలుపుదల చేసి నడుచుకుంటూ రావాలని సూచించారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్క రూ సహకరించాలని కోరా రు. కార్యక్రమంలో దేవదాయశాఖ సహాయ కమిషనర్ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి, అర్బన్, రూరల్ సీఐలు డి.వినోద్‌కుమార్, వై.శ్రీనివాసరావు, ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్, సిబ్బంది పాల్గొన్నారు.





ఉత్సవ గ్రౌండులో ఏర్పాటుచేసిన క్యూలైన్లు, బంగారు దక్షిణావృత శంఖు

ధనుర్మాస వ్రత దీక్షలతో వెయ్యి జన్మల పుణ్యఫలం

● త్రిదండి చినజీయర్ స్వామి

భక్తులకు అనుగ్రహ భాషణం చేస్తున్న త్రిదండి చినజీయర్ స్వామి



గుంటూరు(తూర్పు), జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర స్వామికి అత్యంత ప్రీతికరమైన ధనుర్మాసంలో దీక్షలను ఆచరిస్తే వెయ్యి జన్మల పుణ్యఫలం సిద్ధిస్తుందని శ్రీ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్ స్వామి అన్నారు. ధనుర్మాసాన్ని పురష్కరించుకుని స్థానిక గోరంట్ల శ్రీవేంకటేశ్వర స్వామి సొసైటీ(పెద్దగుడి)లో బుధవారం స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామీజీ భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఐదువేల సంవత్సరాల క్రితమే స్వామి వారిని నమ్మి గోదాదేవి పూజలు చేసింది. స్వామివారిని మానవ రూపంలోనే ఆయనకు పూజలు చేసిన పరమభక్తురాలు గోదాదేవి అని తెలియజేశారు. పాండవులు, శబరి, సుగ్రీవుడు దేవుడిని నమ్మి విజయాలు సాధించారు. కౌరవులు, వాలి, రావణాసురుడు, రాక్షసులు నమ్మక పోవడంతో నాశనమయ్యారు. ప్రత్యక్ష, విగ్రహ రూపంలోనైనా దేవుడిని నమ్మాలి. ధనుర్మాసాన్ని మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో దీక్షలు చేయాలి. అప్పుడే పుణ్యఫలం సిద్ధిస్తుంది. ఈ దీక్షలతోనే మహిళలకు సమాన హక్కులను పది దశాబ్దాల క్రితమే రామానుజ స్వామి వారు కల్పించారు. ఇప్పుడు హక్కుల కోసం మహిళలు పోరాడటం బాధాకరం. రామానుజయ స్వామి కల్పించిన హక్కులతో మహిళలు ఉత్తేజంతో పనిచేయాలని అనుగ్రహ భాషణం చేశారు. అంతకు ముందు స్వామీజీకి ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ ఛైర్మన్ కంచర్ల ఆంజనేయులు, అధ్యక్షుడు యర్రంశెట్టి వేణుగోపాల్ తదితరులు పర్యవేక్షించారు.

సాగునీటి ప్రక్షాళనకు శ్రీకారం

● నేడు ప్రాజెక్టు కమిటీ తొలి సమావేశం
● సత్తెనపల్లి జలవనరులశాఖ అతిథి గృహంలో నిర్వహణ
● కీలక నిర్ణయాలు తీసుకుంటేనే మేలంటున్న రైతులు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

సాగునీటి వ్యవస్థ ప్రక్షాళనకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ నేపథ్యంలో ఇటీవల నిర్వహించిన ఎన్నికల ద్వారా ఎన్నికైన సాగునీటి సంఘాలకు కాల్వల బాగు బాధ్యతలను ప్రభుత్వం అప్పగించింది. ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన సాగునీటి వ్యవస్థను గాడిలో పెట్టేందుకు నీటి సంఘాలు కృషి చేయనున్నాయి. నాగార్జున సాగర్ జవహర్ కుడి కాల్వ ప్రాజెక్టు కమిటీ అధికారం చేపట్టాక తొలి సమావేశం గురువారం జరగనుంది. సత్తెనపల్లిలోని జలవనరుల శాఖ అతిథి గృహంలో సమావేశం ఏర్పాటు చేశారు. ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పులుకూరి కాంతారావు అధ్యక్షతన జరిగే సమావేశానికి వైస్ ఛైర్మన్ ఉప్పలపాటి చక్రపాణి, డిస్ట్రిబ్యూటరీ కమిటీ అధ్యక్షులు, జలవనరుల శాఖ అధికారులు హాజరుకానున్నారు. సమావేశంలో కాల్వల నిర్వహణ, నీటి సరఫరా, మరమ్మతులు తదితర అంశాలపై చర్చించనున్నారు. అధ్వాన కాల్వలపై సంఘాలు దృష్టి సారించాలి. నీటి సరఫరాలో తలెత్తుతున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నడ్డుం కట్టాలి. కాల్వల నిర్వహణలో భాగస్వాములు కావాల్సిన గురుతర బాధ్యతను సంఘాలపై ప్రభుత్వం ఉంచింది. రైతులతో సంఘాలు మమేకం అవుతూ ఎప్పటికప్పుడు నిధులతో సంబంధంలేని సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. రైతులు ఎన్నో ఆశలు.. ఎంతో నమ్మకంతో సంఘాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రైతుల నమ్మకం వమ్ము కానివ్వకుండా సంఘాల పాలన సాగాల్సి ఉంది. ఈ దిశగా సంఘాలు జలవనరుల శాఖ.. రైతుల మధ్య వారధిగా పనిచేయాల్సి ఉంది. ఏమాత్రం అలసత్వం.. నిర్లక్ష్యం వహించినా సంఘాల ఎన్నికల లక్ష్యం నీరుగారి పోనున్నది. సంఘాలు నీటి సరఫరాలో రైతులకు పూర్తి భరోసాను ఇవ్వాల్సి ఉంది. చివరి భూములకు నీరు అందక పోవడానికి కారణాలను గుర్తిస్తే సదరు సమస్య పరిష్కారం పెద్ద పని కాదన్న వాదన రైతుల నుంచి వ్యక్తమవుతోంది. సంఘాలు అంకిత భావంతో పనిచేస్తే అన్నదాతలకు సాగు నీటి ఇక్కట్లు తప్పినట్లే.

సమావేశం అజెండా..

- డివిజన్ వారీగా జరుగుతున్న పనులు.
- 2025-26 సంవత్సరంలో నాగార్జున సాగర్ కుడికాల్వను సక్రమంగా నడుపుటకు కావాల్సిన, చేపట్టాల్సిన పనులు
- డ్యాంలోని నీటి లభ్యతను బట్టి అనుసరించాల్సిన నీటి నియంత్రణ పద్ధతులు, వారబందీ ఆవశ్యకత.
- కాంట్రాక్టు విధానంలో లస్కర్ల నియామకం.
- తూముల వద్ద షట్టర్లు ఏర్పాటు
- జిల్లాల సరిహద్దులలో నీటి నియంత్రణ ప్రణాళిక
- సభ్యులు ప్రస్తావించే ఇతర అంశాలపై చర్చ

రోజూ వెయ్యి క్యూసెక్కులు వృథా

నాగార్జున సాగర్ ప్రాజెక్టు ద్వారా విడుదల చేస్తున్న రోజూ నీటిలో 1,000 క్యూసెక్కుల నీరు వృథా అవుతున్నట్లు జలవనరుల శాఖ లెక్కలు చెబుతున్నాయి. ప్రాజెక్టు నుంచి బుగ్గవాగు లోపు కాల్వకట్టల నుంచి ఊట రూపంలో వెయ్యి క్యూసెక్కుల నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలి. కాల్వలకు నీరు విడుదల చేసేందుకు తూములకు షట్టర్లు లేవు. దీంతో సాగు నీరు వృథాగా వాగుల్లో పారుతున్నది. షట్టర్లు లేని కారణంగా అవసరం లేని సమయంలో నీటి సరఫరాను మైనర్లకు నిలుపుదల చేసే అవకాశం లేకుండా పోతోంది. నీటి వృథాను అరికట్టేందుకు కాల్వలకు షటర్ల ఏర్పాటు తక్షణావసరంగా ఉంది.

మరమ్మతులపై పర్యవేక్షణ అవసరం

కాల్వల మరమ్మతుల పనులను రెండు డివిజన్లలో చేపట్టారు. మరో మూడు డివిజన్లలో పనులు టెండర్ దశలో ఉన్నాయి. ఈ పనులపై సంఘాల పర్యవేక్షణ ఉంటేనే పూర్తిస్థాయిలో అవి జరిగే అవకాశం ఉంటుంది. సాగర్ లింగంగుంట్ల సర్కిల్ పరిధిలో 302 పనులను గుర్తించారు. ఈ పనులకు రూ.17.69 కోట్లు ప్రభుత్వం విడుదల చేసింది. పూడికతీత, కంప చెట్లు, జమ్ము, తూటుకాడ తొలగింపు పనులు చేపట్టాల్సి ఉంది. లింగంగుంట్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో 76 పనులకు వ్యయ అంచనా రూ.4.21 కోట్లు. మాచర్ల ఓఅండ్ఎం డివిజన్ పరిధిలో 101 పనుల వ్యయ అంచనా రూ.4.69 కోట్లు. ఓఅండ్ఎం డివిజన్ సత్తెనపల్లి పరిధిలో 62 పనుల వ్యయ అంచనా రూ3.34 కోట్లు. లింగంగుంట్ల మానిటరింగ్ డివిజన్ పరిధిలో 31 పనుల వ్యయ అంచనా రూ.3.65 కోట్లు. సిఫ్ట్ డివిజన్ వినుకొండ పరిధిలో 34 పనుల వ్యయ అంచనా రూ.1.78 కోట్లు. అయితే సత్తెనపల్లి, నరసరావుపేట లింగంగుంట్ల ఓఅండ్ఎం, వినుకొండ సిఫ్ట్ డివిజన్ల పరిధిలోని పనుల టెండర్లను చేశారు. మాచర్ల, లింగంగుంట్ల పనులు జరుగుతున్నాయి.

చిలకలూరి పేట మేజర్ కాలువలో పెరిగిన కంప



మోదీకి బ్రహ్మరథం



రోడ్‌షోలో ప్రధాని మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అభివాదం



విశాఖపట్నంలో ప్రధాని మోదీ రోడ్‌షో, హాజరైన అశేష జనం

భారీగా తరలివచ్చిన జనం

- రోడ్‌షోలో ప్రజలకు ప్రధాని అభివాదం
- పూలవర్షం కురిపించిన అభిమానులు
- కేరింతలు, చప్పట్లతో మార్మోగిన ఏయూ ప్రాంగణం

ప్రధాని నరేంద్రమోదీ బుధవారం సాయంత్రం విశాఖపట్నంలో నిర్వహించిన రోడ్‌షో, బహిరంగ సభ సూపర్ సక్సెస్ అయ్యాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలిసారి రాష్ట్రానికి వచ్చిన ప్రధానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దబ్‌ఐలాండ్ వద్ద రోడ్‌షో కోసం ప్రత్యేక వాహనంపైకి ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎంలు చేరగానే చప్పట్లు, కేరింతలతో స్వాగతం పలికారు. మహిళాభిమానులు అడుగడుగునా పూల వర్షం కురిపించారు. మరో వైపు ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలోని సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. మోదీ ప్రసంగిస్తున్నంత సేపూ చప్పట్లతో ప్రాంగణాన్ని మార్మోగించారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి



బహిరంగ సభ వేదికపై మోదీ అభివాదం. చిత్రంలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఉన్నారు.



ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అరకు కాఫీని అందిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, చిత్రంలో గవర్నర్ అబ్దుల్ నజీర్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఉన్నారు.



వేదికపై ప్రధాని మోదీ, చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్, నారా లోకేశ్



బహిరంగ సభకు హాజరైన అశేష జనం

పశ్చిమడెల్టాకాల్వకు 1516 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1716 క్యూసెక్కుల సాగునీటిని బుధవారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజి వద్ద 11.6 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 150 క్యూసెక్కులు, తూర్పు కాల్వకు 195 క్యూసెక్కులు, పశ్చిమ కాల్వకు 100 క్యూసెక్కులు, నిజాంపట్నం కాల్వకు 120 క్యూసెక్కులు, కొమ్మమూరు కాల్వకు 693 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.

1154 బస్తాల పసుపు విక్రయం

దుగ్గిరాల, జనవరి 8: స్థానిక పసుపు మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో 1154 బస్తాల పసుపును రైతులు వ్యాపారులకు విక్రయించారు. కొమ్ములు, కాయ ఒకే ధరలు పలుకగా, క్వింటాల్‌కు కనిష్ఠ ధర రూ.10,500, గరిష్ఠ ధర రూ.11,775, మోడల్ ధర రూ.11,500 పలికాయి.

రజకులను కించపరచడం తగదు

తాడేపల్లి టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ఓ టీవీ ఛానల్ డిబేట్‌లో పీ చిట్టిబాబు అనే వ్యక్తి రజకులను ఏక వచనంతో మాట్లాడుతూ కించపరిచారని, 24 గంటల్లో ఆయన రజకులకు క్షమాపణ చెప్పని పక్షంలో ఆయన ఇంటి ముందే ధర్నా చేస్తామని రజక అభ్యుదయ సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు దావులూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో హెచ్చరించారు. కులదూషణ చట్టం కింద అతనిపై కేసు పెడతామని అన్నారు. ప్రకటన విడుదల చేసినవారిలో రాష్ట్ర అధ్యక్షుడు వల్లూరు మధుసూదనరావు, కృష్ణా జిల్లా అధ్యక్షుడు నీలాపు సురేంద్ర, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు రేగల లక్ష్మణరావ ఉన్నారు.

ప్రకాష్‌నగర్‌లో అర్జీల స్వీకరణ

తాడేపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఇల్లు లేని పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని సీపీఐ తాడేపల్లి ప్రాంత కార్యదర్శి కంచర్ల కాశయ్య సహాయ కార్యదర్శి తుడిమిల్ల వెంకటయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు బుధవారం ప్రకాష్‌నగర్‌లోని కార్యాలయం వద్ద పేదల నుంచి ఇళ్ల స్థలాల కోసం అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నేతలు షేక్ బాషా, చిన్న, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఐదో రోజుకు చేరిన క్లాప్ డ్రైవర్ల సమ్మె

మంగళగిరి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ క్లాప్ ఆటో డ్రైవర్లు చేస్తున్న సమ్మె బుధవారంతో ఐదో రోజుకు చేరింది. సీఐటీయూ నేతలు సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. క్లాప్ ఆటో డ్రైవర్లకు రెండు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని, నెలకు వేతనం రూ.24,500 ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సమస్యలను అనేకమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు బాలాజీ, టీ శ్రీరాములు, దుర్గారావు, డీ శివ, ఎంరవి, ఆర్ కృష్ణ, వై శివ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీమహంకాళీ అమ్మవారి హుండీ ఆదాయం రూ.12లక్షల66,245



హుండీ కానుకలను లెక్కింపును పరిశీలిస్తున్న దేవదాయశాఖ అధికారులు

దుగ్గిరాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కేఆర్ కొండూరులోని శ్రీమహంకాళీ అమ్మవారి దేవస్థానం హుండీ కానుకలను మూడు నెలల అనంతరం బుధవారం లెక్కించారు. గతేడాది అక్టోబరు నెలలో లెక్కించిన అనంతరం జనవరి నెలవరకూ భక్తులు అమ్మవారి హుండీల్లో సమర్పించిన కానుకలను లెక్కించగా 12లక్షల 66వేల 245 రూపాయల ఆదాయం లభించినట్లు ఆలయ కార్య నిర్వాహక కార్యదర్శి కోగంటి సునీల్‌కుమార్ తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వెంకట శ్రీనివాసులు పర్యవేక్షణ జరిగిన లెక్కింపులో వ్యవస్థాపక ధర్మకర్త దేవాభక్తుని రంగప్రసాద్, అర్చకులు, స్వచ్ఛంద సేవాసంస్థలు, భక్తులు పాల్గొన్నారు.

వరదొస్తే వణుకే..



ఉధృతంగా ప్రవహిస్తున్న నల్లమడ వాగు (ఫైల్‌ఫొటో)

- కొద్దిపాటి వర్షాలకే పొంగి పొర్లుతున్న వాగులు
- గండ్లు పడ్డా పూడ్చని అధికారులు
- మేటలు వేసి దెబ్బతింటున్న పైర్లు
- నష్టాలతో అల్లాడుతున్న రైతులు
- కూటమి ప్రభుత్వం ఆధునికీకరణ చేపట్టేనా..?

పెదనందిపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలపరిధిలో అధిక వర్షాలు కురిసి వరద వచ్చిందంటే ప్రజలు రైతులు వణికిపోతున్నారు. తుఫాను వచ్చినప్పుడల్లా వాగులు వంకలు చెరువులు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పంట పొలాలు నీట మునుగుతున్నాయి. లక్షలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి ఆరుగాలం శ్రమించిన రైతులకు ఆత్మహత్యలే శరణ్యమవుతున్నాయి. వరద నీటితో చేతికొచ్చిన పంట పొలాలు సైతం కొట్టుకుపోవడం, పొలాలు బీటలు వారడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉండిపోతున్నారు. ప్రభుత్వాలు అందించే సాయం కోసం ఎదురు చూపులే మిగులుతున్నాయి. తుఫాను సంభవించినప్పుడల్లా మండలంలోని ప్రధాన కాలువలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తుంటాయి వీటి ఉధృతికి సమీప పంట పొలాలకు తీవ్రంగా నష్టం వాటిల్లుతుంది. ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకు నల్లమడ, నక్క, మేకల వాగులు పొంగిపొర్లి కట్టలు తెగిపోయి పైర్లు తుడిచిపెట్టుకుపోతున్నాయి. ఈ ప్రాంతం తాగు సాగునీటి సమస్యలతో అల్లాడుండగా, ప్రతి ఏడాది పంట వేసిన నెలల్లోనే వరదలు, భారీ వర్షాలకు వాగుకట్టలు తెగిపోవడంతో రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారు. వరదల సమయాల్లో ఈ వాగుల్లో నీటి ఉధృతికి ఎనిమిది గ్రామాల్లో సుమారుగా 2500 ఎకరాల వరకు పైర్లు దెబ్బతింటాయి. గత ప్రభుత్వం కనీసం పంట కాలువల పూడికతీత పనులు కానీ, వాగుల ఆధునికీకరణ పనులు కానీ చేపట్టకపోవడం వల్ల రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఖరీఫ్‌లో పంటలు సాగుచేసి వేలాది రూపాయల పెట్టుబడులు పెట్టి పంటలు సాగుచేస్తే వరదలకు పంటలు పూర్తిగా దెబ్బతింటాయి. ఆ నష్టాన్ని పూడ్చేందుకు మరలా రైతులు ప్రత్యామ్నాయ పంటలు వేసేందుకు సిద్ధమవుతారు. అధ్వానంగా మారిన పంట కాలువలు, వాగులకు పడిన గండ్లతో పంట చేతికొచ్చేవరకు రైతులు బిక్కుబిక్కుమంటూ ఉండాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల బాగోగులు చూసేందుకు కూటమి ప్రభుత్వం నీటి సంఘాలను ఎంపిక చేయడంతో వాగులు, కాలువలు ఆధునికీకరణ చేపడతారనే ఆశతో రైతులు ఎదురుచూస్తున్నారు. నల్లమడ వాగు ఆధునికీకరణకు గతంలో టీడీపీ ప్రభుత్వం ప్రతిపాదనలు తయారుచేసి పనులు చేపట్టేందుకు సిద్ధం చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చి రీటెండర్ల పేరుతో నిలిపివేసింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో ప్రాజెక్టులకు అత్యధిక ప్రాధాన్యమిస్తూ, నిధులు కేటాయించారని దీంతో నల్లమడ ఆధునికీకరణ జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



నీట మునిగిన పంట పొలాలు (ఫైల్‌ఫొటో)

ముంపు సమస్యను పరిష్కరించాలి



- కాపు వెంకటసుబ్బారావు, రైతు, నాగులపాడు గ్రామం

ఈ ప్రాంత ముంపు సమస్యను పరిష్కరించి, ఆదుకోవాలని, కొద్దిపాటి వర్షాలకు పడిన గండ్ల ద్వారా నీరు పొలాల్లోకి చేరి పంటలు పూర్తిగా దెబ్బతిని లక్షలాది రూపాయలు నష్టం వాటిల్లుతుందని, ప్రభుత్వం నిధులు కేటాయించి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

హామీ నెరవేర్చాలి



- కొల్లా రాజమోహనరావు, నల్లమడ రైతు సంఘ నేత,

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే నల్లమడ వాగు ఆధునికీకరణ పనులు తిరిగి చేపడతామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చారని, ఆ మేరకు 45వేల క్యూసెక్కుల నీరు పారుదలయ్యేలా ఆధునికీకరణ పనులు చేపట్టాలని, దీనికిగాను నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించి రైతులను ఆదుకోవాలని కోరారు.

చదువుతో పాటు సాంస్కృతిక రంగాల్లోనూ రాణించాలి

● డీఈవో రేణుక



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రేణుక, పక్కన పల్నాడు డీఈవో చంద్రకళ

ప్రత్తిపాడు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చదువుతో పాటు సాంస్కృతిక రంగంలో ప్రావీణ్యం ఉన్న విద్యార్థులు మానసికంగా దృఢత్వం పొందుతారని డీఈవో రేణుక అన్నారు. మండల పరిధిలోని బోయపాలెం వద్ద ఉన్న డైట్ కళాశాలలో రంగోత్సవ్ 20-25 జిల్లా స్థాయి కాంపిటీషన్స్ నిర్వహించారు. డైట్ కళాశాల ప్రిన్సిపాల్, పల్నాడు డీఈవో చంద్రకళ ఆధ్వర్యంలో నిర్వహించిన రంగోత్సవ్‌లో క్విజ్, డ్రాయింగ్, హ్యాండ్ రైటింగ్, రంగోళి, ఫోక్ డ్యాన్స్, డిజిటల్ పోస్టర్ ఆన్ యూనిటీ అండ్ ఇన్‌టిగ్రిటీ, స్లోగన్స్ రైటింగ్ ఆన్ ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్, రోల్ ప్లేలో పోటీలు నిర్వహించారు. రేణుక మాట్లాడుతూ విద్యార్థులు వారికున్న ఆసక్తి మేరకు ఏదో ఒక క్రీడలో కాని, డ్రాయింగ్ వంటి వాటిలో కాని రాణించాలని చెప్పారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీలో ఆటలకు ప్రాధాన్యమిస్తారని, ఆట, పాటల్లో రాణించే వారు చాలా గొప్పగా ఉంటారని, శాస్త్రీయంగా నిరూపితమైందని అన్నారు. ప్రతి పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు విద్యార్థులను ఆయా రంగాల్లో ప్రోత్సహించాలని సూచించారు. 'రంగోత్సవ్'లో ఉమ్మడి గుంటూరు జిల్లా పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

అవగాహనతో చదవడం వల్ల విజయ సోపానం

● ఆర్‌జేడీ బీ లింగేశ్వరరెడ్డి



ఫిరంగిపురంలో విద్యార్థులకు ఎస్‌టీయూ ఏపీ అందించిన స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న ఆర్‌జేడీ బీ లింగేశ్వరరెడ్డి

ఫిరంగిపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రోజువారి అవగాహనతో చదవడం వల్ల విద్యార్థులు విజయతీరాలకు చేరగలరని ఆర్‌జేడీ బీ లింగేశ్వరరెడ్డి అన్నారు. స్థానిక సెయింట్ పాల్స్ హైస్కూల్ ఆడిటోరియంలో బుధవారం ఎస్‌టీయూఏపీ ఆధ్వర్యంలో మండలంలోని 10వ తరగతి చదివే ఐదు వందల మంది విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ స్టడీ మెటీరియలే సర్వస్వం అనుకోకుండా పాఠ్య పుస్తకాలు బాగా చదవాలని, రిఫరెన్స్‌లు చదివి అర్థం చేసుకోవాలని సూచించారు. ఎంసీఈఆర్‌టీ ఇచ్చిన వంద రోజుల ప్రణాళిక, మోడల్ పేపర్లు ప్రభుత్వం సరఫరా చేసిందని, దాని ద్వారా విద్యార్థులు అత్యున్నత స్థాయి మార్కులు సాధించవచ్చని అన్నారు. విజయనగరం జిల్లాలో రోజు వారి పరీక్షలు విద్యార్థులు రాసే విధంగా చేయడం వల్ల వారిలో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాల్లో నిలిచారన్నారు. రాష్ట్ర ఎస్‌టీయూ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి మాట్లాడుతూ విద్యే మానవ జీవితాన్ని ఎక్కువగా ప్రభావితం చేస్తుందని అన్నారు. జిల్లా ఎస్‌టీయూ అధ్యక్షుడు పెద్దబాబు మాట్లాడుతూ ఉపాధ్యా య హక్కులతో పాటు బాధ్యతలు గుర్తించిన సంఘం ఎస్‌టీయూ(ఏపీ) అని తెలిపారు. మండల అధ్యక్షుడు పాలడుగు ప్రసాదు మాట్లాడుతూ ఇప్పటివరకు ఉపాధ్యాయుల సమస్యలతో పోరాడిన సంఘం విద్యార్థులకు కూడా ఉపయోగపడే విధంగా స్టడీ మెటీరియల్‌ను అందించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సుబ్బారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సుందరరావు, స్పాన్సర్ మాయకుంట శౌరి ఇన్నాసమ్మ, శ్రీనివాస్, హెచ్ఎం శౌరయ్య పాల్గొన్నారు.

తహసీల్దార్ సేవలు స్ఫూర్తిదాయకం : ఎమ్మెల్యే శ్రావణ్



డిప్యూటి కలెక్టర్‌గా పదోన్నతి పొందిన తహసీల్దార్ నాసరయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తాడికొండ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): తాడికొండ తహసీల్దార్‌గా పనిచేస్తున్న నాసరయ్య స్ఫూర్తిదాయకంగా పనిచేసి ప్రతి ఒక్కరిని మెప్పించారని ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. తాడికొండ తహసీల్దార్‌గా పనిచేస్తున్న కే. నాసరయ్యకు డిప్యూటి కలెక్టర్‌గా పదోన్నతి రావటంతో బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో సన్మాన సభను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఎమ్మెల్యే ఈ సందర్భంగా మాట్లాడారు. తహసీల్దార్‌గా నాలుగున్నర నెలలుగా పని అందరిని సమన్వయం చేసుకొని పనిచేశారని తెలిపారు. రెవెన్యూ సదస్సును సమర్థవంతంగా నిర్వహించారన్నారు. పదోన్నతిపై పోలవరం ప్రాజెక్టుకు వెళ్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో మరెన్నో ఉన్నత పదవులు పొందాలని ఆకాంక్షించారు. అనంతరం శాలువ, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సమతావాణి, సీఐ కే వాసు, టీడీపీ మండల అధ్యక్షులు తలశిల ప్రసన్నకుమార్, సీనియర్ నాయకులు ఎడ్డూరి వీర హనుమంతరావు, కంచర్ల శివరామయ్య, గుంటుపల్లి మధుసూదనరావు, గడ్డిపాటి సాంబశివరావు, యడ్లపల్లి సాంబశివరావు, చిగురుపాటి అనూప్, దూళిపాళ్ల ఏసుబాబు, కొమ్మినేని రామచంద్రరావు, ఆర్.ఐ నూతలపాటి హనుమంతరావు, డిప్యూటి తహసీల్దార్, వీఆర్‌వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సైన్స్ ప్రదర్శనలో సత్తా చాటిన జిల్లా విద్యార్థులు

● జాతీయ స్థాయి పోటీలకు నాలుగు ప్రాజెక్టుల ఎంపిక

గుంటూరు(విద్య), జనవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రదర్శనలలో జిల్లా విద్యార్థులు మరోసారి తమ సత్తాచాటారు. ఈ నెల 7, 8 తేదీల్లో విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా విద్యార్థుల నాలుగు ప్రాజెక్టులు జాతీయ స్థాయిలో జరిగే సదరన్ ఇండియా సైన్స్ ప్రదర్శనకు ఎంపికైన నట్లు డీఈవో సీవీ రేణుక, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ గౌసుల్ మీరా బుధవారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు పుదుచ్చేరిలో జరిగే సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌లో ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొనే 35 ప్రాజెక్టులను ఎంపిక చేయగా అందులో నుంచి అత్యధికంగా నాలుగు ప్రాజెక్టులు గుంటూరు జిల్లాకు సంబంధించినవే ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులను, గైడ్ టీచర్లను డీఈవో అభినందించారు. కార్య క్రమంలో జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసుల్ మీరా, గైడ్ టీచర్లు అరుణ కుమారి, రామాంజనేయులు, ఆరిఫ్ బేగ్, శివారెడ్డి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినులను అభినందిస్తున్న డీఈవో సీవీ రేణుక తదితరులు

నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తే చర్యలు



నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్న సిబ్బంది

మంగళగిరి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఎంటీఎంసీ పరిధిలో ప్లాస్టిక్ సంచులు, వస్తువుల నిషేధం అమల్లో ఉందని, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ అలీం బాషా హెచ్చరించారు. మంగళగిరి, తాడేపల్లి ప్రాంతాల్లో ఎంటీఎంసీ, సచివాలయ సిబ్బంది ప్రత్యేక బృందాలుగా ఏర్పడి బుధవారం పలుచోట్ల దాడులు నిర్వహించారు. నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను విక్రయిస్తున్నట్టు గుర్తించి 25 కిలోల ప్లాస్టిక్ సంచులు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలను అతిక్రమించిన వారికి ఇకపై భారీ మొత్తంలో జరిమానాలు విధిస్తామని ఆయన హెచ్చరించారు.


పొనుగుపాడులో 'వారధి'

ఫిరంగిపురం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొనుగు పాడులో మంగళవారం రాత్రి వారధి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ బీ రవీంద్రబాబు మాట్లాడుతూ సైబర్ నేరాల బారినపడొద్దని, దొంగతనాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని, నేరగాళ్ళ చేతికి చిక్కి డబ్బు, విలువైన వస్తువులు పోగొట్టుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలోయువకులు, పోలీస్ సిబ్బంది, స్థానిక పెద్దలు కోసూరి హరిబాబు, రాఘవరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

నోటు పుస్తకాల పంపిణీ

దుగ్గిరాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఈమనిలోని జడ్పీ హైస్కూల్‌లోని 800 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలను బుధవారం అందించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకై మంత్రి నారా లోకేశ్ పంపిన నోటు పుసస్తకాలను స్థానిక టీడీపీ నాయకుల చేతుల మీదుగా అందజేశారు. తమ పిల్లలకు ప్రభుత్వం అందిస్తున్న పాఠ్య పుస్తకాలతో పాటు నోటుపుసకాలను సైతం అందించడంపై తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాబోతు దేవదాసు, కొల్లిపర అబ్బారావు, కంచర్ల రాంబాబు, గడ్డం సురేష్, ఆరుంబాక రాంబాబు పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి పంపిణీ



విద్యార్థులకు పరీక్ష అట్టలు, పెన్నులు, పెన్సిళ్లు అందిస్తున్న దూళ్ల హరియాదవ్

దుగ్గిరాల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చింతలపూడిలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పరీక్ష సామగ్రి బుధవారం అందించారు. గ్రామానికి చెందిన దూళ్ల సాంబయ్య జ్ఞాపకార్థం కుమారుడు బీసీ సంఘ నాయకుడు దూళ్ల హరియాదవ్ సేవా దృక్పథంతో తరచూ చేపడుతున్న కార్యక్రమాల్లో భాగంగా, పేద విద్యార్థుల కోసం పరీక్ష సామగ్రి అందించడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయుడు ఉన్నం ప్రసాద్ అన్నారు. ఏడీఏ రాజకుమారి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ



పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులతో నిర్వాహకులు

తాడేపల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి సూపర్ లీగ్ పేరిట నిర్వహిస్తున్న టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ రెండో రోజు పోటీలు బుధవారం ఉత్సాహంగా సాగాయి. ఐదు మ్యాచ్‌లు నిర్వహించారు. విజేతలుగా అన్‌స్టాపబుల్ తేజ లెవన్, మహానాడు లెవన్, సీతానగరం లెవన్, యూసీ లెవన్ విజయం సాధించాయి. జనసేన మండల అధ్యక్షుడు సామల నాగేశ్వరరావు, రాష్ట్ర ఐటీ కోఆర్డినేటర్ చవ్వాకుల కోటేశ్‌బాబు, పద్మశాలి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ పర్వతం మధు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత తప్పు దారి పట్టకుండా కూటమి ప్రభుత్వం ఇటువంటి పోటీలు నిర్వహించడం హర్షణీయమన్నారు.

స్త్రీ, పురుష సమానత్వంపై అవగాహన



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న కేఎల్‌యూ విద్యార్థులు

మంగళగిరి సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లి కేఎల్ యూనివర్సిటీ బీసీఏ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళగిరి మండలం ఆత్మకూరులో బుధవారం స్త్రీ, పురుష సమానత్వంపై విద్యార్థులు ఇంటింటికీ తిరిగి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ కే సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నేటి సమాజంలో ఇంకా కొన్ని ప్రాంతాల్లో స్త్రీ, పురుషుల మధ్య అసమానతలు ఉన్నాయని, ఇది సమాజ హితానికి మంచిది కాదని అన్నారు. బీసీఏ విభాగాధిపతి డాక్టర్ కే భగవాన్ మాట్లాడుతూ స్త్రీ, పురుషులు ఇద్దరూ సమానమేనని, విద్య, ఉద్యోగం, వివాహం వంటి విషయాల్లో లింగభేదం చూపించడం సమంజసం కాదని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కేఎల్‌యూ ప్రతినిధులు బి.కృష్ణప్రసాద్,డి.ఉషారాణి, పి.సురేష్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కేఎల్‌యూ ఉపకులపతిజీ పార్థసారధివర్మ, ప్రోవైస్ చాన్సలర్లు ఏవీఎస్ ప్రసాద్, ఎన్ వెంకట్రామ్, కే రాజశేఖర్‌రావు, కేఆర్ఎస్ ప్రసాద్, హబీబుల్లా ఖాన్, పీ శ్రీకాంత్‌రెడ్డి అభినందించారు.

రెవెన్యూ సదస్సులో 269 అర్జీలు



బోడిపాలెంలో గ్రామరెవెన్యూ సదస్సులో పాల్గొన్న తహసీల్దార్ వెంకటస్వామి

కాకుమాను, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా జరిగిన రెవెన్యూ సదస్సుల ద్వారా రైతుల నుంచి 269 అర్జీలు స్వీకరించినట్లు తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. బోడిపాలెంలో గ్రామ సచివాలయం వద్ద బుధవారం రెవెన్యూ గ్రామసభ జరిగింది. గ్రామంలో భూముల సర్వే కోసం 12 అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ చెప్పారు. రైతుల నుంచి భూసమస్యల కోసం వచ్చిన ప్రతి అర్జీని ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు తెలిపారు. ఈ గ్రామసభల ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. రెవెన్యూ గ్రామసభలో ఆర్ఐ ప్రియదర్శిని, వీఆర్వో, రైతులు తదితరులు పాల్గొన్నారు.

అవయవ దానంపై అవగాహన పెరగాలి



అవయవ దానం ఆవశ్యకతను తెలియజేస్తూ టీషర్టులు ధరించిన విద్యార్థులు

మంగళగిరి సిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అవయవదానంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అఖిల భారత శరీర అవయవదాన సంఘం జిల్లా అధ్యక్షుడు ముక్కాల కిరణ్‌బాబు కోరారు. ఆత్మకూరు నిర్మల ఫార్మసీ కళాశాలలో జరుగుతున్న యువజన క్రీడోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు అవయవ దానంపై బుధవారం అవగాహన కల్పించారు. సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్టు, అఖిల భారత శరీర, అవయవ దాన సంఘం ఆధ్వర్యంలో అవయవదాన ఆవశ్యకతను ప్రతిబింబించేలా టీషర్టులను పంపిణీ చేశారు. 40 మంది విద్యార్థులకు రూ.6,500 విలువైన టీషర్టులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కొండవీటి నర్మద, కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ జీ నిర్మల జ్యోతి, ప్రిన్సిపాల్ పాములరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షిలో థీమాటిక్ ఎగ్జిబిషన్

గుంటూరు, జనవరి 8(ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేటలోని లేపాక్షి హస్త కళల ఎంపోరియం ఈ నెల 6న ప్రారంభమైన థీమాటిక్ ఎగ్జిబిషన్‌లో చేతి వృత్తుల వారు స్వయంగా తయారు చేసిన వస్తువుల అమ్మకాలు జరుపుతున్నట్లు మేనేజర్ ఎంవీఎన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 10వ తేదీ వరకు అమ్మకాలు కొనసాగుతాయన్నారు. ఈ ఎగ్జిబిషన్‌లో కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక బొమ్మలు, కలంకారి, లెదర్ పప్పెట్, దుర్గి స్టోన్‌బొమ్మలు అమ్మకానికి ఉంటాయన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

తెనాలి క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు తెనాలి జీఆర్పీ ఎస్ఐ జీ వెంకటాద్రి బుధవారం తెలిపారు. విజయవాడ-బాపట్ల ప్రధాన రైలు మార్గంలో మోదుకూరు రైల్వేస్టేషన్ సమీపంలో 378/25 కి.మీ వద్ద బుధవారం ఉదయం గౌహతి-బెంగుళూరు ఎక్స్‌ప్రెస్ వస్తున్న సమయంలో గుర్తు తెలియని 30-32 సంవత్సరాల వయసు కలిగిన యువకుడు ఎక్స్‌ప్రెస్‌కు ఎదురు వెళ్లడంతో రైలు ఢీకొని సంఘటన స్థలంలో మృతి చెందాడు. మృతుని వద్ద ఎలాంటి వ్యక్తిగత వివరాలు లభించకపోవడంతో కేసు నమోదు చేసి మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

ఏఎన్‌యూ ఉపకులపతి ఎంపికకు సెర్చ్ కమిటీ నియామకం

గుంటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం (ఏఎన్‌యూ) ఉప కులపతిని ఎంపిక చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సెర్చ్ కమిటీని నియమించింది. మొత్తం ముగ్గురు పేర్లను సూచించాల్సిందిగా ఆదేశించింది. సెర్చ్ కమిటీలో డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ పూర్వ వీసీ డాక్టర్ సీవీరావు, గీతమ్ విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కే.శివరామకృష్ణ, యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి ఆచార్య సంజీవ్ జైన్‌ని నియమించింది. ఈ త్రిసభ్య కమిటీ అన్ని విషయాలను పరిగణనలోకి తీసుకొని ముగ్గురు పేర్లను సిఫార్సు చేస్తుంది. ఆ ముగ్గురిలో ఒకరిని వీసీగా ఎంపిక చేస్తారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ సెక్రటరీ కోన శశిధర్ బుధవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు.



కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు

పొన్నూరు టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా పట్టణంలోని తెలగపాలెం సీత లక్ష్మణ్ హనుమత్ సమేత కోదండరామస్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ధనుర్మాసాన్ని పురస్కరించుకొని 24వ పాశురం మంగళపాశురాన్ని పాటించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు చిలకపాటి లక్ష్మణ్ రామాచార్యులు, దేవరాజ స్వామి ఆచార్యులు ఆధ్వర్యంలో దీపోత్సవం నిర్వహించారు.

అన్నపై తమ్ముడు దాడి

తెనాలి, మారీసుపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అన్నపై తమ్ముడు దాడిచేసిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. త్రీటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం స్థానిక బాలాజీరావుపేటలో నవాబ్ దంపతులకు ఇద్దరు కుమారులు. వారిలో పెద్ద కుమారుడు షేక్ సుభాని రోజువారీ కూలీగా పనిచేస్తూ తల్లిదండ్రులను పోషిస్తున్నాడు. మరో కుమారుడు జిందావలి ఆటో నడుపుతూ దుగ్గిరాలలో జీవిస్తున్నాడు. గత కొంతకాలంగా జిందావలి మద్యానికి బానిసై తల్లిదండ్రులతో గొడవలు పడుతున్నాడు. బుధవారం మద్యానికి డబ్బులు ఇవ్వాలని తల్లిదండ్రులతో గొడవ పడుతుండగా అమ్మనాన్నలతో అన్న సుభాని మందలించాడు. దీనిపై ఆగ్రహించిన జిందావలి కర్రతో సుభానిపై దాడిచేయటంతో తలకు గాయాలయ్యాయి. బాధితుడిని స్థానికులు వైద్యసాయం కోసం జిల్లా వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలి: చందు

తెనాలి అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీల భారాన్ని తగ్గించాలని కాంగ్రెస్ కన్వీనర్ డాక్టర్ చందు సాంబశివుడు కోరారు. ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచడానికి వినియోగదారుల సమావేశాలకు పిలుపునివ్వడాన్ని నిరసిస్తూ బుధవారం ట్రాన్స్ కో ఈఈ చిరంజీవికి వినతి పత్రం అందజేశారు. ఇప్పటికే ట్రూ అప్ చార్జీల పేరిట భారం మోపారని, వాటి భారం ఇంకా పెంచుతూ పోతున్నారని, దీంతో విద్యుత్ వినియోగం కన్నా చార్జీల భారం పెరిగిపోతుందన్నారు. గృహ వాణిజ్య చార్జీలను పెంచే ఆలోచన చేయవద్దని, అవినీతితో కూడుకున్న సోలార్ విద్యుత్ కాంట్రాక్టు రద్దుచేయాలని కోరారు. పార్టీ నాయకులు కర్లపూడి బుల్లియ్య, గుర్రపు ద్వారకా శ్రీనివాస్, శివకుమార్, శివన్నారాయణ, రాయప్ప, శంకరరావు, స్టీవెన్‌బాబు పాల్గొన్నారు.

13నుంచి కొల్లిపరలో సాంస్కృతిక కార్యక్రమాలు

● శ్రీకళానిలయం కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి

కొల్లిపర, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం కొల్లిపర శ్రీఅవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలో శ్రీకళానిలయం ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను పురస్కరించుకుని వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కళానిలయం కార్యదర్శి బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. బుధవారం శ్రీకళానిలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 13వ తేదీ రాత్రి 6.30గంటలకు మోహినీ భస్మాసుర కూచిపూడి నృత్యప్రదర్శన, 8 గంటలకు విజేతలు సాంఘిక నాటకం, 9గంటలకు విడాకులు కావాలి నాటిక, 14వ తేదీన ఉదయం 10గంటలకు మండలస్థాయిలో ముగ్గుల పోటీలు, రాత్రి 7గంటలకు జానపద నృత్యప్రదర్శన, కోలాట ప్రదర్శన, 8.30 గంటలకు విద్యార్థులకు ప్రతిభా పురస్కారం, 9 గంటలకు ప్రత్యేక నృత్యప్రదర్శన, 15వ తేదీన రాత్రి 6.30గంటలకు పాడాలని ఉంది సినీ సంగీత విభావరి, 8.30 గంటలకు రంగవల్లి విజేతలకు బహుమతులు, 9 గంటలకు ఇది అతని సంతకం నాటకం ప్రదర్శించనున్నట్లు తెలియజేశారు. సమావేశంలో శ్రీకళానిలయం కమిటీ అధ్యక్షుడు జొన్నల అమ్మిరెడ్డి, కోశాధికారి గుదిబండి మహేశ్వరరెడ్డి, కమిటీ సభ్యులు గుదిబండి సోమశేఖరరెడ్డి, భీమవరపు కోటిరెడ్డి, జొన్నల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటోలపై కొరవడిన పోలీసుల నియంత్రణ

● కనీస వివరాలు సేకరించని పోలీసులు
● ఆటో డ్రైవర్ల నేరప్రవృత్తిపై సమాచారం నిల్
● ఇటీవల జరిగిన పలు సంఘటనలతో ప్రయాణికుల్లో భయాందోళనలు
● పోలీసులు దృష్టి సారించాలని పలువురి డిమాండ్



ప్రధాన రహదారిపై నిలిపి ఉంచిన ఆటోలు, యూనిఫాం లేకుండా ఆటోలను నడుపుతున్న డ్రైవర్లు

తెనాలి క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆటోల సంఖ్య పెరిగింది. ఇతిమిద్ధంగా వీటి సంఖ్య ఎంత అంటే పోలీసు వారి వద్ద కూడా లెక్కలు లేవు. ఇటీవల నేర ప్రవృత్తి గల వ్యక్తులు ఆటోడ్రైవర్లగా అవతారమెత్తుతున్నారు. ఒంటరిగా ఉన్న ప్రయాణికులను గుర్తించి ఆటోలో ఎక్కించుకుని నిలువు దోపిడీ చేస్తున్నారు. రాత్రివేళ ఆటో ఎక్కిన యువతులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న ఆటో డ్రైవర్లు మరికొందరు, కళాశాలకు, పాఠశాలకు వచ్చే విద్యార్థినులపై ప్రేమ పేరుతో లోబరుచుకునే వారు మరికొందరు. గత నెలలో సాయంత్రం సమయంలో బుడంపాడు బైపాస్ నుంచి తెనాలి రావటానికి ఆటో ఎక్కిన యువతిని బుడంపాడు-నారాకోడూరు మధ్య ఆటోని దారి మళ్లించి యువతిపై అఘయిత్యం చేయబోగా ఆటోలో నుంచి దూకి ఆ యువతి తప్పించుకున్న సంఘటన జరిగింది. కొద్ది రోజుల క్రితం గుంటూరు వెళ్లటానికి తెనాలిలో ఆటో ఎక్కిన వ్యక్తిని నారాకోడూరు వద్ద దారి మళ్లించి నగదు దోపిడీ చేసిన సంఘటన, ఇటీవల మండూరులో రోజు ఇంజనీరింగ్ కళాశాలకు విద్యార్థిని తీసుకు వచ్చే ఆటోడ్రైవర్ ప్రేమ పేరుతో బాలికను లొంగతీసుకున్నాడు. గతంలో దుండిపాలెంలో జైలు జీవితం గడిపిన ఆటోడ్రైవర్ కళాశాల విద్యార్థిని ప్రేమ పేరుతో వివాహం చేసుకోవటానికి యత్నించడం, ఆ గొడవలు పోలీస్‌స్టేషన్‌కు చేరాయి. మోదుకూరుకు చెందిన ఓ రైతు నిమ్మ మార్కెట్‌లో నిమ్మకాయలు అమ్మి ఆటో కోసం ఎదురు చూస్తుండగా ఆటో మోదుకూరు వెళతుందని చెప్పి మధ్యలో ప్రసాదం అంటూ మత్తు కలిపిన పదార్థం ఇచ్చి నగదు దోపిడీ చేయడం, గుంటూరు నుంచి వచ్చిన యువతి వేమూరు వెళ్లటానికి తెనాలి మార్కెట్‌లో రాత్రి 8గంటల ప్రాంతంలో ఆటో ఎక్కగా దారి మధ్యలో ఆటోను పొలాల్లోకి దారి మళ్లించగా గుర్తించిన యువతి బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి కాపాడిన సంఘటన ఇటీవల చోటు చేసుకుంది. ఇలాంటి సంఘటనలు కొన్ని వెలుగులోకి వస్తే వెలుగులోకి రానివి ఈ ప్రాంతంలో కొదువలేదు. ఇలాంటి సంఘటనలను నిరోధించడంలో పోలీసులు అలసత్వం కనిపిస్తోందని ఈ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. ఎక్కువ మంది ఆటోడ్రైవర్లు యూనిఫాం వేసుకుని కనిపించడం లేదు. పోలీసులు, ఆర్టీవో అధికారులు అడగరు. గతంలో జైలుశిక్ష అనుభవించిన ఆటో డ్రైవర్లు మద్యం మత్తులో ఆటో తోలుతున్నా వారిపై నిఘా అంతంతమాత్రంగానే ఉంది. ఒకప్పుడు తెలుగుదేశం పాలనలో ఆటో డ్రైవర్లపై పోలీసులు పూర్తి పట్టు ఉండేది. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎన్ని ఆటోలు ఉన్నాయి. వాటి ఓనరు, డ్రైవరు, ఆధార్ కార్డు ప్రూఫ్‌లు, డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఆటో ఏ ప్రాంతంలో తిరిగేది, డ్రైవర్ ఫొటో గుర్తింపుతో కూడిన పోలీస్‌స్టేషన్ ఇచ్చిన నెంబరు, ఫోన్ నెంబరు ఆటోలో ప్రయాణికులు గుర్తించేలా పలు ఏర్పాట్లు ఉండేవి. దీంతో పట్టణంలోకి ఇతర ప్రాంతాల ఆటోలు వస్తే గుర్తించడానికి అవకాశం ఉండేది. సరైన ఆటోల సమాచారం ఉంటే అవి ప్రమాదానికి గురైనా, డ్రైవర్లు నేరానికి పాల్పడినా వెంటనే గుర్తించే అవకాశం ఉంటుంది. పట్టణ పోలీసులు ఈ దిశగా చర్యలు తీసుకోకపోవడంతో ఆటోల డ్రైవర్ల ముసుగులో నేరస్థులు చేస్తున్న ఆగడాలు మితిమీరిపోతున్నాయని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. దీనిపై పోలీసులు దృష్టిసారించాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

నిర్ణీత సమయంలో అర్జీలను పరిష్కరిస్తాం

ఇండిపెండెంట్ చార్జ్ తహసీల్దార్ పవార్ స్వాప్నిల్ జగనాథ్



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ గోపాలకృష్ణ, కొల్లిపర రెవెన్యూ సదస్సులో రికార్డులను పరిశీలిస్తున్న తహసీల్దార్ సిద్ధార్థ

తెనాలి రూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించి అన్నదాతలకు మేలు చేసేందుకు రెవెన్యూ గ్రామ సభలు దోహదపడతాయని ఇండిపెండెంట్ చార్జ్ తహసీల్దార్ పవార్ స్వాప్నిల్ జగనాథ్ చెప్పారు. రెవెన్యూ గ్రామ సభల్లో భాగంగా బుధవారం పట్టణంలోని ఐతానగర్‌లో ఇండిపెండెంట్ చార్జ్ తహసీల్దార్ పవార్ స్వాప్నిల్ జగనాథ్, తహసీల్దార్ గోపాలకృష్ణలు రెవెన్యూ అధికారులతో కలిసి రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 19 అర్జీలు రాగా అందులో 17 సర్వేకి మరో రెండు మ్యుటేషన్‌కు వచ్చినట్లు తహసీల్దార్ గోపాలకృష్ణ వెల్లడించారు. నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించడం జరుగుతుందని స్పష్టం చేశారు. దేవదాయ, పలు శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

భూ విలువలపై అధికారుల సర్వే

పట్టణంలోని ఐతానగర్, మండలంలోని కఠెవరం గ్రామాల్లో భూముల వాల్యూపై ఇండిపెండెంట్ చార్జ్ తహసీల్దార్ పవార్ స్వాప్నిల్ జగనాథ్, తహసీల్దార్ గోపాలకృష్ణలు, ఇతర శాఖల అధికారులతో కలిసి సర్వే చేశారు. గతంలో పోల్చుకుంటే ప్రస్తుతం భూమి ధరలు పెరిగినట్లు అంచనా వేశారు.

● కొల్లిపర: మండలంలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులు ముగిశాయని తహసీల్దార్ సిద్ధార్థ అన్నారు. బుధవారం మండల కేంద్రం కొల్లిపర పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని రికార్డులను పరిశీలించారు. రైతులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రైతులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా సిద్ధార్థ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిశీలించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. మండలంలో 139మంది రైతులు భూమికి సంబంధించిన సమస్యలను దరఖాస్తురూపంలో తెలియజేసినట్లు తెలిపారు. భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పిల్లి రాధిక, రిజిష్టార్ అదినారాయణరెడ్డి, ఏఎస్‌వో మనోహర్‌రెడ్డి, ఆర్ఐ కిశోర్, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన సాంకేతికతతో రహదారుల నిర్మాణం

● పంచాయతీరాజ్ ఈఎన్‌సీ బాలు నాయక్
● రహదారి పనులను పరిశీలించిన ఎన్‌ఆర్‌ఐడీఏ, వివిధ రాష్ట్రాల అధికారులు



ఎన్ఆర్ఐడీఏ అధికారులకు రహదారి నిర్మాణంపై అవగాహన కల్పిస్తున్న ఈఎన్‌సీ బాలు నాయక్

పొన్నూరు టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): నూతన సాంకేతికతతో రహదారుల నిర్మాణం చేపడితే నాణ్యత పెరగడంతో పాటు రహదారుల మన్నిక కాలం పెరుగుతుందని పంచాయతీరాజ్ ఈఎన్‌సీ బాలునాయక్ అన్నారు. పొన్నూరు మండలం మామిళ్ళపల్లి గ్రామం నుంచి కట్టెంపూడి గ్రామం వరకు ఆధునిక పద్ధతిలో నిర్మిస్తున్న రహదారిని బుధవారం నేషనల్ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ ఏజెన్సీ అధికారులు సందర్శించారు. ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన కార్యక్రమంలో భాగంగా రూ.5కోట్ల వ్యయంతో రహదారి నిర్మాణం పనులు జరుగుతున్నాయి. ఈ రహదారి ప్రాంతంలో నల్లరేగడి భూములు ఉండటంతో రహదారి నిర్మించిన కొద్ది కాలానికే రహదారి ధ్వంసమై మరమ్మతులకు గురవుతోంది ప్రతిసారీ రహదారి నిర్మాణానికి నిధులు వెచ్చించటం ధ్వంసం అవటం గుర్తించిన అధికారులు నూతన సాంకేతికతతో రహదారి మన్నిక పెంచేందుకు కొత్త సాంకేతికతను అమలు చేస్తున్నారు. ఈ విధానం ద్వారా రహదారిపై జియో గ్రిడ్ మ్యాట్ పరిచి దానిపై రహదారి నిర్మించడం ద్వారా ఎక్కువ కాలం రహదారి పాడవకుండా ఉంటుంది. రాష్ట్రంలో ఈ విధానంలో నిర్మితమవుతున్న మామిళ్ళపల్లి, కట్టెంపూడి రహదారిని పరిశీలించేందుకు వివిధ రాష్ట్రాలకు చెందిన ఇంజనీరింగ్ అధికారులు, ఈ పరిశీలన కార్యక్రమానికి విచ్చేశారు. ఈఎన్‌సీ బాలునాయక్, ఈ రహదారి నిర్మాణ విశేషాలను ఎన్ఆర్ఐడీఏ అధికారులకు తెలియజేశారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐడీ జాయింట్ డైరెక్టర్ రంజన్, ఏడీ రజనీష్ కుమార్, చీఫ్ ఇంజనీర్లు జి కిరణ్ కుమార్. లలిత్ కుమార్, పులకిత్ నారుల్, వరుణ్ షకియా, రేఖా సింగ్, ప్రాజెక్ట్ మేనేజర్లు కుమార్ సాతక్, రోహిత్ సన్న, సీఎస్ఆర్‌కె ప్రసాద్, కేరళా చీఫ్ ఇంజనీర్ అనీల్ కుమార్, ఎంపవర్ ఆఫీసర్ షాజి, తెలంగాణ అధికారులు వి కనకరత్నం, బీవీ సుబ్బారావు, ముజీబ్, జీ నరేంద్ర ప్రసాద్, లవకుమార్, సాయి శ్రీవాత్సవ, బి ప్రశ్నకుమార్, పుదుచ్చేరి అధికారులు ఎస్.ముత్త శివం, ఎ.శిలువనాథం, తమిళనాడు అధికారులు ఏ కట్టులింగం, బి వెంకటేశన్, కె.గుణశేఖర్, కె.బాలమురుగన్, సిదార్థ, స్థానిక చీఫ్ ఇంజనీర్ శివకుమార్, ఎస్ఈ బ్రహ్మయ్య, చిదిపోతు సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ పనుల్లో అలసత్వాన్ని సహించేదిలేదు

● మున్సిపల్ కమిషనర్ శేషన్న



శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

తెనాలి, మారీసుపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రతిరోజు నిర్వహించే శానిటేషన్ పనుల్లో పారిశుధ్య కార్మికులు అలసత్వం వహిస్తే సహించేదిలేదని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. బుధవారం పట్టణంలో పలు వార్డులలో జరగుతున్న శానిటేషన్ పనులను అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా డ్రెయిన్‌లలో పేరుకు పోయిన సిల్ట్‌ను కార్మికులు తొలగించి వాటి అంచున పోయడాన్ని గుర్తించి ఎప్పటిఎప్పుడు వాటిని డంపింగ్ యార్డుకు తరలించేలా చర్యలు చేపట్టాలని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. రోడ్లపై వేసిన వ్యర్థాలు ఉండటం వలన మురుగునీరు రోడ్లపై పారి వాహనదారులు, పాదచారులు ఇబ్బందులుపడే అవకాశం ఉందన్నారు. వెంటనే వ్యర్థాలను తొలగించాలని అధికారులకు సూచించారు. అనంతరం స్థానికులతో మాట్లాడి ఇంట వద్దనే చెత్తను పారిశుధ్య కార్మికులు సేకరిస్తున్నారా లేదా అన్న వివరాలను ఆరాతీసి సంతృప్తిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనధికార ఫ్లెక్సీలను తొలగించండి: కమిషనర్

తెనాలి, మారీసుపేట, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఏర్పాటుచేసిన అనధికార ఫ్లెక్సీలతో వాహనల రాకపోకలకు ఇబ్బందికరంగా ఉన్నాయని వెంటనే వాటిని తొలగించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. స్థానిక బోసు రోడ్డులో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి కమిషనర్ రోడ్లపై ఏర్పాటు చేసిన వ్యాపారుల అనధికార ఫ్లెక్సీలను గమనించి తక్షణమే వాటిని తొలగించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ సుందరీకరణలో భాగంగా రోడ్లపై అనధికార ఫ్లెక్సీల ఏర్పాటును నిషేధించామన్నారు. ఎవరైనాసరే మున్సిపల్ అనుమతులు లేకుండా మున్సిపల్ స్థలాలలో ఫ్లెక్సీను ఏర్పాటుచేస్తే తొలగించడం జరుగుతుందన్నారు. వ్యాపారులు కూడా మునిసిపాలిటీకి సహకరిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా వ్యాపార ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధలను అతిక్రమించి పదేపదే అనధికార ఫ్లెక్సీలను ఏర్పాటుచేస్తే మున్సిపల్ చట్టం ప్రకారం వారికి నోటీసులు జారీచేసి అపరాధ రుసుం విధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో దేశభక్తి: ఎంఈవో

పొన్నూరు టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ శిక్షణతో దేశభక్తి పెంపొందించుకోవచ్చని మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల పరిధిలోని మామిళ్లపల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో బుధవారం భారత స్కౌట్స్ అండ్ గైడ్ శాఖల ప్రారంభం జరిగింది. సుభాష్ చంద్రబోస్, ఝాన్సీ లక్ష్మీబాయి ట్రూపుల పేరుతో రెండు గ్రూపులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులు, భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ అభ్యర్థులు దేశభక్తి విషయంలో ముందుంటారని కొనియాడారు. భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యదర్శి ఏడుకొండలు మాట్లాడుతూ కొత్త ట్రూపులు విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బాల యేసు, స్కౌట్ అండ్ గైడ్స్ సీహెచ్ రమేష్, కె నీలాబాయి, ఉమమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి నాటికి రహదారుల మరమ్మతులు పూర్తి

● ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరావు

తెనాలి క్రైం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రారంభించిన రోడ్ల మరమ్మతులు ఫిబ్రవరి నాటికి పూర్తికానున్నాయని బాపట్ల జిల్లా ఆర్ అండ్ బీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వేములపల్లి శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ప్యాచ్ వర్కుల కింద జిల్లా ప్రధాన రహదారులకు రూ.27 కోట్లతో 108 పనులు చేపట్టామన్నారు. ఇందులో 52 పనులు ఇప్పటికే పూర్తయ్యాయని, ఫిబ్రవరి మొదటి వారం కల్లా మిగిలిన పనులు పూర్తవుతాయన్నారు. చేపట్టిన పనులలో అమృతలూరు, గూడవల్లి, పాంచాళవరం రోడ్డు, రేపల్లె, తుమ్మల, గంగడపాలెం రోడ్డు, చందోలు బ్రిడ్జి, నిజాంపట్నం రోడ్డు, చినపులివర్రు, కేపీరోడ్డు, సంతమాగులూరు, కోటప్పకొండ రూట్‌లు పనులు చివరి దశలో ఉన్నాయన్నారు. రాష్ట్ర రహదారులకు రూ.4 కోట్లతో 22 పనులు చేపట్టగా ఇప్పటికే 12 పూర్తయ్యాయి. మొత్తం 130 రోడ్ల మరమ్మతులు చేపట్టగా ఫిబ్రవరి మొదటి వారం కల్లా పనులు పూర్తవుతాయన్నారు.

ఆలయంలో అర్చకుడిపై దాడి

పొన్నూరు టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణంలో ఆలయంలోని అర్చకుడిపై జరిగిన దాడి కలకలం రేకెత్తించింది. శంకర మఠం బజారులో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయంలో అర్చకుడిగా నూతలపాటి నాగేశ్వరశర్మ పనిచేస్తున్నారు. ఇటీవల నాగేశ్వరశర్మకు ఇంటి సమీపంలోని ఓ మహిళతో వివాదం చెలరేగింది. ఈ వివాదం నేపథ్యంలో పోలీసులకు పరస్పరం ఫిర్యాదు చేసుకోవడంతో పెద్దలు రాజీచేశారు. అయితే మంగళవారం ఆలయంలో విధులలో ఉన్న నాగేశ్వరశర్మపై విజయ్ దినకర్ అనే వ్యక్తి వచ్చి దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డాడు. నాగేశ్వర శర్మ పెద్దగా కేకలు వేయడంతో స్థానికులు వచ్చి దాడిచేస్తున్న వ్యక్తిని వారించి బయటకి పంపారు. అయితే ఈ దాడితో తీవ్రంగా గాయపడిన నాగేశ్వరశర్మ సమీపంలోని బంధువులు ఇంటికి వెళ్లి తలదాచుకున్నట్లు సమాచారం. నాగేశ్వరశర్మపై జరిగిన దాడి ఆలయంలోని సీసీటీవీలో రికార్డు కావడంతో ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం జరిగాయి. ఈ దృశ్యాలు చూసిన బ్రాహ్మణ సంఘాలు దాడి విషయంపై తీవ్ర నిరసనలు వ్యక్తం చేస్తున్నారు. పొన్నూరు బ్రాహ్మణ మహాసభ, విశ్వహిందూ పరిషత్ తదితర సంఘాల నాయకులు భవిష్యత్తు కార్యాచరణపై సమావేశం అయినట్లు సమాచారం. అర్చకుడిపై దాడి విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలని అర్చక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

రాత్రివేళ ఇసుక లోడుచేస్తే కఠిన చర్యలు

● డీఎస్పీ జనార్ధనరావు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ జనార్ధనరావు

కొల్లిపర, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): చీకట్లో ఇసుక దందాపై ఆంధ్రజ్యోతిలో బుధవారం ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. ఇసుకరీచ్ నిర్వహకులతో డీఎస్పీ జనార్ధనరావు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఇసుకరీచ్ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే వాహనాలకు ఇసుకను లోడు చేయాలన్నారు. అన్ని రీచ్‌లలో పోలీసులతో పహరా నిర్వహిస్తున్నామని వివరించారు. తహసీల్దార్ సిద్ధార్థమాట్లాడుతూ కృష్ణానదిలో ఎక్సకవేటర్లుతో లారీలకు ఇసుకను లోడు చేస్తే ఆ ఇసుకరీచ్‌ని సీజ్ చేస్తామన్నారు. కూలీలతో ఇసుకను ట్రాక్టర్లకు పోసి అక్కడి నుంచి ఒడ్డుకు తరలించాలన్నారు. ఒడ్డుకు తరలించిన తర్వాతే ఎక్సకవేటర్‌తో లారీలకు ఇసుక నింపాలన్నారు. ఆరు గంటల తర్వాత డంపింగ్ దగ్గర కూడా ఇసుకను లోడు చేయకూడదన్నారు. సమావేశంలో తెనాలి రూరల్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైకుంఠపురంలో ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు

తెనాలి అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి పర్వదినం కోసం వైకుంఠపురం ఆలయంలో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 10న ఉత్తర ద్వార దర్శనంలో స్వామి వారిని భక్తులు దర్శించుకునేందుకు క్యూ లైన్లు నిర్మించారు. ముఖద్వారం నుంచి భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు క్యూలైన్లు, ప్రాంగణం అంతా షామియానాతో తీర్చిదిద్దారు. ఉచిత దర్శనంతో పాటు రూ.150కు శీఘ్ర దర్శనం, రూ.300లకు వీఐపీ దర్శనం ఏర్పాటు చేశారు. భక్తులకు అన్నదానం, తాగునీటి ప్యాకెట్లు పంపిణీ చేయనున్నారు.

దీనిఇస్తేమాకు పటిష్ట బందోబస్తు: ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్పీ

గుంటూరు, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పెదకాకాని పోలీస్ స్టేషన్ పరిధిలోని నంబూరులో ముస్లిం పెద్దల ఆధ్వర్యంలో జరగనున్న 'దీనిఇస్తేమా' కార్యక్రమానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ స్పష్టం చేశారు. ఈ నెల 11న మధ్యాహ్నం నుంచి 13 మధ్యాహ్నం వరకు కార్యక్రమం జరగనుంది. ముస్లింలు ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రార్థనలు నిర్వహించే ప్రాంగణంను పరిశీలించి, భక్తులకు ఎటువంటి అసౌకర్యం, అవాంఛనీయ ఘటనలు కలగకుండా తగిన బందోబస్తు ఏర్పాటు చేయాలని పెదకాకాని సీఐ నారాయణస్వామిని ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్బీ డీఎస్పీ సీతారామయ్య, ఎస్బీ సీఐ అలహరి శ్రీనివాస్, కాకాని సీఐ నారాయణ స్వామి, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.



పూల పల్లకిపై స్వామివారిని ఊరేగిస్తున్న అర్చకులు

ధనుర్మాస ఉత్సవాల్లో పుష్పయాగం

తెనాలి అర్బన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వీఎస్ఆర్ అండ్ ఎన్వీఆర్ కళాశాల రోడ్డులో నిర్వహిస్తున్న ధనుర్మాస ఉత్సవాల్లో స్వామి అమ్మవార్లకు బుధవారం పుష్పయాగం నిర్వహించారు. ఆర్టీసీ బస్‌స్టేషన్ నుంచి బుట్టలతో పూలను ఊరేగింపుగా ఉత్సవ ప్రాంగణంకు తీసుకువెళ్లారు. అనంతరం స్వామి అమ్మవార్లను పూలపల్లకిపై పుష్పాలతో ఊరేగించారు. గోదాదేవి 24వ పాశురాన్ని ద్రవిణ భాషలో స్తుతించారు. శరణాగతి గోష్టి ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలను నరేంద్ర రామానుజ దాస స్వామి పర్యవేక్షించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.



బహుమతి అందుకుంటున్న విద్యార్థిని నజ్మా

రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో నజ్మా ప్రతిభ

చేబ్రోలు జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో నారాకోడూరు విద్యార్థిని షేక్ నజ్మా ప్రతిభ కనబరిచి బహుమతి గెలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం ఏడుకొండలు బుధవారం తెలిపారు. ఈ నెల 7, 8 తేదీలలో విజయవాడలో రాష్ట్రస్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. నారాకోడూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌కి చెందిన నజ్మా ఈ సైన్స్ ఫెయిర్‌లో పాల్గొని వ్యక్తిగత విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. నజ్మా ప్రతిభతో ప్రాజెక్టు సదరన్ ఇండియా సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైనట్లు తెలిపారు. జనవరి 21 నుంచి పుదుచ్చేరిలో జరిగే సైన్స్ ఫెయిర్‌లో నజ్మా పాల్గొనున్నట్లు వివరించారు. ప్రతిభను కనబరుస్తున్న షేక్ నజ్మాను జిల్లా విద్యాశాఖ అధికారిని సీవీ రేణుక, గైడ్ టీచర్ అరుణకుమారి, జిల్లా సైన్స్ అధికారి షేక్ గౌసూల్ మీరా తదితరులు అభినందించారు.

అపరాల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

● మండల వ్యవసాయధికారి డేగల వెంకటరామయ్య

పొన్నూరు టౌన్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉప్పరపాలెం సీతారామపురంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందదర్భంగా గ్రామాల్లో అపరాల పంటలు పరిశీలించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఏవో మాట్లాడుతూ పెసర, నిలువు పంటలో నత్రజని, భాస్వరం, పొటాష్ పోషకాలను పిచికారి రూపంలో అందిస్తే ఆశించిన దిగుబడులు సాధించవచ్చున్నారు. కలుపు మందులు వాడకంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.